నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
సోమవారం | 23 డిసెంబర్ 2024 | www.navatelangana.com

విద్యార్థులతో సమావేశమైన గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

బాలికల గురుకుల పాఠశాల సందర్శన

నవతెలంగాణ-కొల్చారం

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మండల కేంద్రమైన కొల్చారంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలకు ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు మెదక్ నుంచి రోడ్డు మార్గంలో చేరుకున్నారు. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి అలుగు వర్షిని, గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిషోర్, పాఠశాల విద్యార్థులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను



శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. గవర్నర్ రాక సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం గవర్నర్ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం నిర్వహించి విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, గురుకుల విద్యాసంస్థల జోనల్ అధికారులు అనంతలక్ష్మి, సక్రు నాయక్, పాఠశాల ప్రిన్సిపాల్ సత్య కుమారి పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



గవర్నర్‌కు ఘనస్వాగతం



నవతెలంగాణ-మెదక్

మెదక్ జిల్లా పర్యటనకు వచ్చిన గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ముందుగా స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎస్పీ ,అదనపు కలెక్టర్ లు, ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డిలు, పుష్పగుచ్చంతో స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఆదివారం మెదక్ చర్చికి వచ్చిన సందర్భంగా గురువులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తొలుత చర్చి ప్రాంగణంలోకి రాగానే మెదక్ ఆర్డీఓ రమాదేవి గవర్నర్‌కు బొకె అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. చర్చి నిర్వాహకులు రెడ్ కార్పెట్ వేసి ఘనమైన స్వాగతం పలికారు. గవర్నర్ క్రీస్తు శిలువ వద్దకు వెళ్లి ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం గురువులు గవర్నర్‌ను శాలువా, కప్పి చర్చి నమూనా విగ్రహాన్ని గవర్నర్‌కు అందజేశారు. మెదక్ చర్చి 100 సం:రాలు పూర్తి అయిన సందర్భంగా ప్రత్యేకంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మాట్లాడుతూ సన్మానీయ అతిథులు, సోదరులు, సోదరీమణులు, పిల్లలు, మెదక్ కాథెడ్రల్‌లో చర్చిలో సమావేశమై అందరికి శుభాకాంక్షలు తెలిపారు. మెదక్ కాథెడ్రల్ 2024 శతాబ్ది ఉత్సవాలలో పాల్గొనడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ఇది కేవలం 100 సంవత్సరాల సంబరమే కాదని విశ్వాసం, తపన, భగవంతుని అమోఘమైన కృపకు నిదర్శనంగా నిలిచే ఒక మహత్తర ఘట్టమన్నారు. ఈ సందర్భంలో క్రీస్తు చెప్పిన మాటలను ఆలోచిద్దామని "ఎక్కడ ఇద్దరు లేదా ముగ్గురు నా నామంలో కూడి ఉన్నారో, అక్కడ నేను వారితో ఉంటాను." గుర్తు చేశారు. గత శతాబ్దంగా, మెదక్ కాథెడ్రల్ చర్చి అనేక మందికి దైవ సాన్నిధ్యానికి కేంద్రంగా నిలిచిందన్నారు. ఒక విశ్వాసం పెంపొందిన స్థలంగానే కాక అనేకమంది జీవితాలు మార్చిన ప్రదేశంగా నిలిచిందన్నారు.

నేటి రైతు దినోత్సవాన్ని జయప్రదం చేయాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

సోమవారం సంగారెడ్డిలో నిర్వహించే రైతు దినోత్సవాన్ని జయప్రదం చేయాలని రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు తుమ్మలపల్లి పృథ్వీరాజ్ కోరారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ మంజీరా రైతు సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించే రైతు దినోత్సవ కార్యక్రమానికి రాష్ట్రంలోని రైతు సోదరులంతా సంగారెడ్డి చౌరస్తా రైతు వేదిక కు చేరుకోవాలని, 10:30కు జరిగే కార్యక్రమంలో పాల్గొని రైతు దినోత్సవ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పి.రవీందర్, ధనంజయ, నాగన్న, మల్లికార్జున, శేఖర్, కుమార్, మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

మనియార్‌పల్లిలో పేకాటరాయుళ్ల అరెస్ట్



నవతెలంగాణ-కోహిర్

మండలంలోని మనియార్పల్లిలో పేకాట రాయుళ్లను పోలీసులు అరెస్టు చేశారు. గ్రామంలోని వ్యవసాయ పొలంలో పేకాట ఆడుతుండగా నమ్మదగిన సమాచారం మేరకు శనివారం రాత్రి పోలీసులు దాడులు చేపట్టారు. పేకాట ఆడు తున్న 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 4 సైకిల్ మోటా ర్లు, రూ.10,400 నగదు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ చెప్పారు.

రాజ్యాంగ వ్యతిరేక శక్తిగా అమిత్ షా

నవతెలంగాణ-కొండాపూర్



రాజ్యాంగ వ్యతిరేక శక్తిగా అమిత్ షా మారారని బీఆర్ఎస్ తొగరపల్లి బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు ఎర్రోళ్ల రవి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అమిత్ షా తన అగ్రకుల ఆధిపత్యాన్ని పార్లమెంట్ సాక్షిగా ప్రదర్శిస్తూ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడం.. దళిత, బహుజన సమాజాన్ని అవమానించిన ట్టుగా వ్యాఖ్యానించడం బాధాకర మన్నారు. భారత రాజ్యాంగం పై ప్రమాణం చేసి మంత్రి పదవిని స్వీకరించి అంబేద్కర్‌ను విమర్శించడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. మనువాద భావజాలాన్ని పెంచి పోషించేలా అంబేద్కర్‌ను టార్గెట్ చేసి మాట్లడడం అంటే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసినట్టుగా భావిస్తున్నామన్నారు..

505

మరనాత విశ్వాస సమాజం మందిరంలో ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి పట్టణంలోని న్యూ బస్టాండ్ రుక్మిణి థియేటర్ పక్కనగల మరనాత విశ్వాస సమాజంలో ప్రీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు, పాటలు ఎంతగానో అలరించాయి. పాస్టర్ అమృత్ రాజ్ సంఘసు్తలతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుప్రభు గొప్పతనాన్ని, ఆయన చూపిన మార్గాన్ని భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు ఫణిందర్, రవి, శివకుమార్, దీపక్, ప్రశాంత్, ప్రేమ్ కుమార్, చంద్రయ్య, సునందరావు, షద్రక్, చంటి, తదితరులు పాల్గొన్నారు.



అందుతున్న సాగునీరు పెరుగుతున్న వరి సాగు

- తగ్గుతూ వస్తున్న పత్తి సాగు

నవతెలంగాణ-గజ్వేల్

ప్రాజెక్టుల నిర్మాణంలో భాగంగా అందుతున్న సాగునీరు మూలంగా రైతులు వరి సాగుపై దృష్టి మల్లుతున్నారు. 2020-2024 పరిశీలన చేస్తే సిద్దిపేట జిల్లాలో గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాలతోపాటు ఆయా మండలాల్లో వరి సాగు పెరుగుతూ పత్తి తగ్గుతూ వస్తుంది. పత్తి పంట సాగు చేస్తున్నప్పటికీ అమ్ముకునే నాటికి తేమ పేరుతో గిట్టుబాటు ధర రావటం లేదు.పెట్టుబడి పత్తికి బాగా బారమవుతుంది. పత్తి అమ్మకాలు ప్రయివేట్ పరంగానే జోరుగా జరుగుతుంది. వర్షాకాలం, రబీ సీజన్ పంటలను పరిశీలిస్తే గత నాలుగు ఏండ్లుగా సాగు పెరుగుతూ వస్తుంది. గజ్వేల్ ప్రాంతంలో మల్లన్న సాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టులు కారణంగా బోరు బావుల్లో నీరు పెరుగుతూ వస్తుంది. సిద్దిపేట ప్రాంతంలో రంగనాయక సాగర్ ఉండటం వల్ల సాగునీటి ఇబ్బందులు లేకుండా ఉందని చెప్పాలి. వర్షాకాలం, రబీ సీజన్లో కలిసి ఎనిమిది లక్షల వరకు వివిధ పంటలు జిల్లాలో సాగు అవుతున్నాయి. ఇందులో ఎక్కువ శాతం వరి సాగుపై ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో రైతుల సాగు మార్పు చేసుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారు. వర్గల్, ములుగు, కుకునూరు పల్లి, మర్కుక, తదితర మండలాల్లో వరి తర్వాత ఆకుకూరలు, కూరగాయల పంటలపై ఎక్కువగా దృష్టి పెడుతున్నారు.



జిల్లాలో...

సిద్దిపేట జిల్లాలో 1.70 లక్షల బోరు బావులు ఉండగా, 1.60 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. దీనికి తోడు ప్రభుత్వం ఉచిత విద్యుత్తు అందిస్తుండడంతో పెద్దగా ఖర్చులు ఉండవని భావిస్తున్న రైతులు పత్తికి దూరమవుతున్నారు. అంతేకాకుండా భూమికి అనుగుణంగా పంటలను సాగు చేయాలని దశాబ్ద కాలంగా పైగా వ్యవసాయ అధికారులు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి చెప్పుతూ వస్తున్నారు. పంట మార్పిడి జరగాలని అధికారులు సూచించడంతో తక్కువ పెట్టుబడి ఎక్కువ గిట్టుబాటు ధర ఉన్న పంటలను ఎంచుకోవాలని క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అవగాహన కలిగిస్తున్న సందర్భంలో రైతుల్లో కొంచెం మార్పు వచ్చింది. పెట్టిన పెట్టుబడి వచ్చే విధంగా రైతులు వాతావరణం పరిస్థితులు అంచనా వేసుకొని పంటలు సాగు చేస్తున్నారు.



-వరి సాగు రబీ. ఎకరాల్లో 2020-21లో 2,83,285. 2021-22లో 2,43,614. 2022-23లో 3.38,156.
2023-24లో 3,48,009 సాగు చేశారు.

వర్షాకాలం వరి ఎకరాలలో..2020-21లో 3,17,161. 2020-22లో 3,65,621. 2022-23లో 3,79,108.
2023-24లో 3,68,000 వరి సాగు చేశారు.
పత్తి పంట సాగు ఎకరాలలో 2021లో 1,27,223. 2022లో 1,16,763. 2023లో1,06,415. 2024లో 1,08,000.

గిట్టుబాటు ధర వస్తుంది

రైతు.వనం నరేష్ దాతర్ పల్లి. మం.గజ్వేల్



వరి సాగు బాగుంటుంది. పత్తికి కష్టం ఎక్కువ. పెట్టుబడి ఎక్కువ. అందుకే వరిపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. వరికి ఎకరాకు రూ.15 వేల వరకు ఖర్చు వస్తుంది. పత్తికి రూ.25 వేల వరకు ఖర్చవుతుంది. మళ్లీ కూలీల కోరతా ఉంది. అందుకే వరి దిక్కు చూస్తున్నాం. ప్రాజెక్టులు ఉండటంవల్ల బోరులో నీరు వస్తుంది. అందుకే వరి నీ సాగు చేస్తున్నాం.

అన్ని రకాల వరి సాగు బాగుంటుంది

రైతు తలారి మహేష్, దాతర్ పల్లి, మం. గజ్వేల్



అన్ని రకాల వరి సాగు బాగుంటుంది. పెట్టుబడి తక్కువ, ప్రాజెక్టులు ఉన్నాయి. పత్తి సాగు కొంత ఇబ్బందిగా ఉంటుంది. పెట్టుబడి ఎక్కువ అవుతుంది. రైతులంతా బోర్లు వేసుకొని వరి సాగు చేస్తున్నారు. ఇతర పంటలపై ఆసక్తి చూపుతున్నారు. పంటల మార్పిడి జరుగుతే బాగుంటుంది. ఎప్పటికీ పత్తి వేయవద్దు.ఎప్పటికీ వరి వేయవద్దు.

విరివిగా విరాళాలు ఇవ్వండి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ.మల్లేశం

నవతెలంగాణ-మెదక్/మెదక్ టౌన్

సీపీఐ(ఎం) నాల్గవ మహాసభలకు ప్రజలు విరాళాలు విరివిగా ఇవ్వాలని సీపీఐ(ఎం) మెదక్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.మల్లేశం ప్రజలను కోరారు. సీపీఐ(ఎం) 4వ రాష్ట్ర మహాసభల సంధర్భంగా మెదక్ పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికి తిరుగుతూ రాష్ట్ర మహాసభల విజయవంతానికి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మెదక్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ. మల్లేశం మాట్లాడుతూ పేదలు, కార్మికుల కోసం ఉద్యమిస్తున్న పార్టీ సీపీఐ(ఎం) అని అన్నారు. మెదక్ జిల్లాకు మంజీరా జలాలు, సాగు త్రాగుకు ఇవ్వాలని, జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని సీపీఐ(ఎం) పోరాడిందన్నారు. జిల్లాలో పోడు భూములు, ధరణి సమస్యలు, ఇతర భూ సమస్యలు, కార్మికుల కనీస వేతనాల గురించి సీపీఐ(ఎం) పోరాడుతుందన్నారు. విద్య, వైద్యం, ఇళ్ల స్థలాలు, రోడ్లు, కాలేశ్వరం కాలువల నిర్మాణం, హైవే త్రిబుల్ ఆర్ లో భూములు కోల్పోయిన నిర్వాసితుల రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని, కార్మిక



సమస్యలు, విద్యార్థులు, యువకులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిత్యం ముందుండి పోరాడుతుందన్నారు. మొదటిసారిగా ఉమ్మడి మెదక్ జిల్లా సంగారెడ్డి పట్టణంలో సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలు 2025 జనవరి 25 నుంచి 28 తేదీల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ మహాసభలకు రాష్ట్ర నలుమూలల నుంచి వెయ్యి మంది ప్రతినిధుల దాకా హాజరవుతారన్నారు. కావున ప్రజల కోసం పోరాడే సీపీఐ(ఎం)కు ప్రజలు, కార్మికులు పెద్ద ఎత్తున విరాళాలు ఇచ్చి రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి. బసవరాజు, జిల్లా కమిటీ సభ్యులు సంతోష్ అజయ్, పాల్గొన్నారు.

పేదలు, కార్మికుల హక్కుల కోసం పోరాడేది ఎర్రజెండానే

సీపీఐ(ఎం) ఇంటింటి కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జయరాజు

నవతెలంగాణ-సంగారెడ్డి

పేదలు, కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడేది సీపీఐ(ఎం) ఎర్రజెండానే అని పార్టీ జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజ్ అన్నారు. పార్టీ మహాసభల సందర్భంగా సంగారెడ్డిలో సీపీఐ(ఎం) ఇంటింటి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై సీపీఐ(ఎం) నిత్యం పోరాటాలు నిర్వహిస్తున్నదన్నారు. మహాసభల విజయవంతం కోసం ప్రతీ గ్రామం, వార్డు పట్టణాల్లో కార్యకర్తలతో విస్తృత ప్రచారం నిర్వహిస్తూ ఇంటింటి విరాళాలు సేకరణ చేస్తున్నామన్నారు. ఈ మహాసభలకు జాతీయ నాయకులు, రాష్ట్ర నాయకులు, రాష్ట్ర నలుమూలల నుంచి ప్రతినిధులు హాజరుకాను న్నారన్నారు. సీపీఐ(ఎం) ప్రజా, కార్మిక, కర్షక, రైతాంగ పోరాటాల నిర్వహించి ప్రజల మద్దతు పొందిందన్నారు. ప్రజలు మహాసభలకు ఆర్థికంగా, హార్థికంగా సహకరిస్తున్నారన్నారు. బూర్జువా పార్టీలకు భిన్నంగా ప్రత్యామ్నాయ విధానాలతో సీపీఐ(ఎం) పని చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ.మానిక్, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణ, నాయకులు బాగారెడ్డి, అశోక్, సురేష్, మహిపాల్ రెడ్డి, విఠల్, జలీల్, రాజు, సత్యనారాయణ, మహేష్, బాలరాజు, మహిపాల్, మౌళగౌడ్, అభిలాష్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



స్వేచ్ఛాయుత వాతావరణంలో విద్యాబోధన జరగాలి

- ఎంపీ రఘునందన్ రావు, హైడ్రా కమీషనర్ రంగనాథ్
- జ్యోతి విద్యాలయ పాఠశాల వార్షికోత్సవానికి హాజరు

నవతెలంగాణ-రామచంద్రాపురం

విద్యార్థులు ఇష్టమైన సబ్జెక్ట్ ఎంచుకొని స్వేచ్ఛాయుత వాతావరణంలో విద్యాబోధన జరగేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందని మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు, హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. రామచంద్రాపురంలోని భేల్ టౌన్షిప్ లో జ్యోతి విద్యాలయ పాఠశాల 45వ వార్షికోత్సవం శనివారం సాయంత్రం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, హైడ్రా కమీషనర్ రంగనాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. విద్యార్థులపై వత్తిడి లేకుండా వారికి ఇష్టమైన సబ్జెక్టుని ఎంచుకొని వారి నైపుణ్యం బట్టి పయనించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చొరవ చూపాలని అన్నారు. విద్యార్థులకు ఇష్టం లేని దారిలో ఒత్తిడి తీసుకువచ్చి ఇతర దారులు వెళ్లే విధంగా చూస్తే వారిలోని నైపుణ్యాన్ని బయటకు రాకుండా ఉంటుందన్నారు. జ్యోతి విద్యాలయ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఎన్నో ఉన్నతమైన శిఖరాలలో ఉన్నారని అభినందించారు. ప్రస్తుతం అన్ని రంగాలలో పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరు స్తున్నారన్నారు. పాఠశాల వార్షికోత్సవానికి ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులే కాకుండా.. గతంలో చదివిన విద్యార్థులు చదువు చెప్పిన ఉపాధ్యాయులు, సిబ్బంది కూడా పెద్దఎత్తున రావడం ఈ పాఠశాల పట్ల వారికి ఉన్న ప్రేమానురాగాలు అర్థమవుతున్నాయన్నారు. పూర్వ విద్యార్థుల సహాయ సహకారంతో దీనస్థితిలో ఉన్న పాఠశాల నేడు అన్ని వసతులతో ఉన్నతమైన స్థితిలో ఉండేందుకు కృషి చేసిన వారందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. అందరి సహకారంతో పాఠశాల ప్రిన్సిపల్ ఉమామహేశ్వరి పాఠశాలను అన్ని విధాలుగా ముందుకు తీసుకుపోతున్నార న్నారు. భేల్ సంస్థ టౌన్షిప్ లో మంచి వాతావరణం కల్పించి పాఠశాలలు మౌలిక వసతులతో విద్యాభివృద్ధికి ఎంతగానో సహక రిస్తున్నాయన్నారు. వార్షికోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అక్కడికి వచ్చిన వారందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. లక్కీ డిప్ ద్వారా విజేతలకు, వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన వారికి అతిథులు బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ సంతు రాజా, భేల్ కంపెనీ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, కస్టమ్స్ జాయింట్ కమిషనర్ మాధురి, నాయకులు ఆదర్శ రెడ్డి, ఆరవ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అందోల్ గురుకులంలో 2వ రోజు విద్యార్థుల ధర్నా

- అడ్డుకున్న జోగిపేట పోలీసులు
- విలేకరులకు అనుమతి నిరాకరణ

నవతెలంగాణ-జోగిపేట

అందోల్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సద్గుణ మేరీ గ్రేస్ మాకు వద్దు అంటూ విద్యార్థులు ఆదివారం కూడా రెండోరోజు పాఠశాల ప్రాంగణంలో ధర్నా చేపట్టారు. జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ వచ్చి విద్యార్థులతో మాట్లాడి వెళ్లినా సమస్య పరిష్కారం కాకపోవడంతో విద్యార్థులు మళ్లీ ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న సీఐ అనిల్ కుమార్, ఎస్ఐ పాండుల ఆధ్వర్యంలో పోలీసులు అక్కడికి చేరుకొని బయటకు రాకుండా అడ్డుకు న్నారు. వారందరిని పాఠశాల భవనం వద్దకు తీసుకువెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చారు. ధర్నా విషయాన్ని తెలుసుకొని విద్యా ర్థులు



అక్కడికి వెళ్ళగా.. పోలీసులు లోనికి అనుమతించలేదు.విద్యార్థిణులను రెచ్చగొట్టి రెండ్రోజుల పాటు ధర్నా చేపట్టడానికి ఉసిగొల్పారాన్న నెపంతో పాఠశాలలో పనిచేస్తున్న పార్ట్ టైం లెక్చరర్ సతీష్‌పై పాఠశాల ప్రిన్సిపాల్ సద్గుణమేరీ గ్రేస్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ఇస్నాపూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన కంటైనర్

- ఇద్దరు మృతి, మరొకరికి స్వల్ప గాయాలు

నవతెలంగాణ-పటాన్‌చెరు

మండల పరిధిలోని ఇస్నాపూర్ జాతీయ రహదారిపై ఆదివారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ద్విచక్ర వాహనాన్ని వెనక నుంచి కంటైనర్ లారీ ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందగా మరొకరు గాయాల పాలయ్యారు. పటాన్‌చెరు సీఐ జి.వినాయక రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ మండల పరిధిలోని కిష్టారెడ్డిపేటకు చెందిన అశోక్ కుమార్ సీవిల్ ఇంజనీర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం సంగారెడ్డిలో ఉండే తన సోదరుడు ఇంటికి.. కిష్టారెడ్డిపేట నుంచి సంగారెడ్డికి స్కూటీపై అశోక్ కుమార్‌తో పాటు భార్య నాగశ్యామల(26) వరుసకి తమ్ముడైన గణేష్ (17) ముగ్గురు కలిసి స్కూటీపై బయలుదేరారు. మార్గమధ్యంలో పటాన్ చెరు మండల పరిధిలోని ఇస్నాపూర్ చౌరస్తా జాతీయ రహదారిపై గల యూటర్న్ వద్దకు రాగానే స్కూటీని వెనుక



నుంచి వేగంగా వచ్చిన కంటైనర్ లారీ బలంగా ఢీకొట్టింది. ప్రమాద ఘటనలో నాగశ్యామల, గణేష్‌లు అక్కడికక్కడే మృతి చెందారు. అశోక్ కుమార్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతులను పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన అశోక్ కుమార్‌ను చికిత్స నిమితతం ఆసుపత్రికి తరలించారు. మృతురాలి భర్త అశోక్ కుమార్ ఫిర్యాదు మేరకు సీఐ వినాయక రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వీఆర్వో వ్యవస్థ లేక గ్రామాల్లో చాలా తప్పిదాలు

తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన (టీజీఆర్ఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు బి.రాంరెడ్డి

నవతెలంగాణ-పటాన్‌చెరు

వీఆర్వో వ్యవస్థ లేక గ్రామాల్లో చాలా తప్పిదాలు జరుగుతున్నాయని తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్(టీజీఆర్ఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు బి.రాంరెడ్డి అన్నారు. రాజుల కాలం నుంచే రెవెన్యూ వ్యవస్థ ఉన్నదని ఆయన తెలిపారు. శనివారం రాత్రి పటన్‌చెరు పరిధిలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రాధ ఆధ్వర్యంలో తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 30 వేల మంది వీఆర్వో, వీఆర్ఏలను గత ప్రభుత్వం తొలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమందిని ఇతర శాఖలకు బదిలీ చేసి రెవెన్యూ శాఖలో క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న వారి మనుగడ లేకుండా చేసిందని దుయ్యబట్టారు. వీఆర్ఏ, వీఆర్వోలు లేకుండా రెవెన్యూ శాఖను ఊహించలేమన్నారు. మళ్లీ రెవెన్యూ శాఖలోకి 11 వేల మంది వీఆర్వోలు రానున్నారని, ఇక ప్రతి గ్రామంలోనూ కనిపిస్తారని చెప్పారు. ఈ పరిణామంతో పాటు భూ భారతిని తీసుకురావడం ద్వారా భూ సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయని తెలిపారు. డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరెడ్డితోనే వీఆర్వో వ్యవస్థ పునరాగమనం సాధ్యపడుతుం దన్నారు. ఇప్పటికైనా



రెవెన్యూ వ్యవస్థ ప్రభావాన్ని తెలుసుకోవాల న్నారు. భూమి శిస్తూ ఉన్నప్పటి నుంచి భూములను లెక్కేసినం, సర్వే చేసినం ఏ రైతుకు ఎంత భూమి ఉంది అని లెక్కలు రాసినం అని ప్రస్తావించారు. మేమందరం మీకు అండగా ఉంటామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పలువురు తహశీల్దార్లు రెవెన్యూ సిబ్బంది మాట్లాడుతూ.. వారు ఎదురు కొంటున్న సమస్యల గురించి ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా కమిటీని ప్రకటించారు. అనంతరం కొత్తగా ఎన్నికైన వారిని శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ పాక, సెక్రటరీ జనరల్ పుల్ సింగ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రాధ, టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.బిక్షం, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సుజాత చౌహాన్, తహశీల్దార్లు, గతంలో పనిచేసిన వీఆర్వోలు, వీఆర్ఏలు, వివిధ రెవెన్యూశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వరకట్నం వేధింపులు..వివాహిత బలవర్మణం

దేవక్కపల్లిలో ఘటన

నవతెలంగాణ-బెజ్జంకి

వరకట్నం వేధింపులతో వివాహిత ఉరేసుకుని బలవర్మణానికి పాల్పడి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని దేవక్కపల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామానికి చెందిన అశ్విని (27)తో సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం దేవక్కపల్లి గ్రామానికి చెందిన వడ్లకొండ



శ్రీనివాస్(32)తో 2020లో వివాహం జరిగింది. తన కనీస అవసరాలకు శ్రీనివాస్ అదనపు వరకట్నం తీసుకురావాలని ఇబ్బందులకు గురి చేస్తుండడంతో భరించలేక ఇంట్లో ఎవరులేని సమయంలో అశ్విని ఉరేసుకుని బలవర్మణానికి పాల్పడి మృతి చెందింది. మృతురాలికి ఒక కుమారుడు ఉన్నాడు. ఘటనపై మృతిరాలి కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. మృతురాలి తండ్రి చంద్రయ్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ క్రిష్టారెడ్డి తెలిపారు.

మల్లికార్జున స్వామి ఆలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-జహీరాబాద్



మండలంలోని హుగ్గెళ్ళి గ్రామంలో గల భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతరలో జహీరాబాద్ ఎమ్మెల్యే కోనింటి మాణిక్‌రావు పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మెన్ శివకుమార్, పార్టీ జహీరాబాద్ మండలాధ్యక్షులు తట్టు నారాయణ, ఝరాసంఘం మండలాధ్యక్షులు వెంకటేశం, మొగుడంపల్లి మండలాధ్యక్షులు సంజీవ్ రెడ్డి, ప్యాక్స్ చైర్మెన్ మచ్చేందర్, కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మెన్ నర్సింహ గౌడ్, బీసీ సెల్ అధ్యక్షులు అమిత్ కుమార్,యువ నాయకులు చిన్న రెడ్డి, ప్రవీణ్ పాటిల్, రాథోడ్ భీమ్‌రావు నాయక్, విజయ్ రాథోడ్ పాల్గొన్నారు.

అలాగే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండలాధ్యక్షులు నరసింహారెడ్డి బృందం పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు.

ఆర్కె ఫౌండేషన్ ఆన్‌లైన్ సేవలకు విశేష స్పందన

నవతెలంగాణ-జిన్నారం



మండల పరిధిలోని కాజిపల్లి పారిశ్రామిక పంచాయతీ ప్రాంతంలో ఆర్కే ఫౌండేషన్ నేతృత్వంలో నిర్వహిస్తున్న ఉచిత ఆన్‌లైన్ సేవా కార్యక్రమాలకు విశేష ప్రజాస్పందన లభిస్తున్నదని ఆర్కే ఫౌండేషన్ చైర్మెన్ అడ్వకేట్ దండే రమాకాంత్ తెలిపారు. వివిధ రకాల సిటిజన్ సర్వీసెస్‌కు సంబంధించిన ఆన్‌లైన్ సేవా ప్రక్రియలో భాగంగా కాజిపల్లిలో ఆదివారం చేపట్టిన కార్యక్రమాలకు పెద్దఎత్తున హాజరై సేవలు వినియోగించు కున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. తొలి రోజు 183 మందికి వివిధ రకాల సిటిజన్ సర్వీసెస్ సంబంధించిన ఆన్లైన్ సేవల ప్రక్రియలను అందించినట్లు రమాకాంత్ చెప్పారు. నేడు(సోమవారం) కూడా ఉచిత ఆన్‌లైన్ సేవ కార్యక్రమాల ప్రక్రియ కొనసాగుతుందని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు, యువకులు, కార్మికులు స్థానికులు పాల్గొన్నారు.



నామ కారణం మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-మనూర్

నాగలిగిద్దకు మండల కేంద్రానికి చెందిన పీఏసీఎస్ చైర్మెన్ శ్రీకాంత్ కుమారుడి నామకరణ మహోత్సవం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఖేడ్ ఎమ్మెల్యే డా పి.సంజీవ్‌రెడ్డి పాల్గొని.. చిన్నారిని ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ పండరి రెడ్డి, మాజీ సర్పంచులు గుండరావు పుండులాల్, నాయకులు సంజయ్ పాటిల్ పాల్గొన్నారు.



వివాహా వేడుకల్లో పాల్గొన్న నరోత్తం..

నవతెలంగాణ-జహీరాబాద్

మొగుడంపల్లి మండలం మన్నాపూర్ గ్రామానికి చెందిన గొల్ల వీరన్న కుమారుడి వివాహా వేడుక జహీరాబాద్ పట్టణంలోని పటేల్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగింది. ఈ వేడుకలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ వై.నరోత్తం పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వేడుకలో అశోక్ రెడ్డి, ఆశన్న, చెంగల్ జైపాల్, జీవన్ రెడ్డి, సూరన్న, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



వివాహ వేడుకలో డీసీసీ ప్రధాన కార్యదర్శి

నవతెలంగాణ-మనూర్

నాగల్గిద్దా మండలం దామర్‌గిద్ద మాజీ సర్పంచ్ ఉత్తమ్ రావు సోదరుని కుమారుడు వివాహం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకలో డీసీసీ ప్రధాన కార్యదర్శి పి.చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని.. నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు పి.విఠల్ రెడ్డి మాజీ సర్పంచ్ మనూర్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆకాష్ రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దేశ ప్రజలకు అమిత్ షా క్షమాపణ చెప్పాలి





నవతెలంగాణ-సంగారెడ్డి

కేంద్ర హోం మంత్రి హోదాలో చట్టాన్ని, రాజ్యాంగాన్ని గౌరవించాల్సిన అమిత్ షా.. అన్ని వర్గాల ప్రజల కోసం రాజ్యాంగాన్ని రూపకల్పన చేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌పై పార్లమెంట్‌లో చేసిన అనుచిత వ్యాఖ్యలు ఆయన హోదాకు తగ్గట్టు లేవని సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.మల్లేష్, జి.సాయిలు ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. దేశ ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయని.. దేశాన్ని మనువాదం వైపు నడిపించే ఈ చర్యను సీఐటీయూ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. మంత్రివర్గం నుంచి ఆయన్ను బర్తరఫ్ చేయాలని.. అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

జహీరాబాద్ డిపోలో నేడు డయల్ యువర్ డీఎం

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ ఆర్టీసీ డిపో పరిధిలో నేడు(సోమవారం) డయల్ యువర్ ఆర్టీసీ డిఎం నిర్వహించనున్నట్టు డిపో మేనేజర్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. ఆర్టీసీకి సంబంధించిన సందేహాలు, సలహాలు, సూచనలను ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు 9959226269 నెంబర్‌కు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.



వెలాసిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షలు

నవతెలంగాణ-జహీరాబాద్

వెలాసిటీ ఆధ్వర్యంలో జహీరాబాద్ పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు మ్యాథ్స్‌లో టాలెంట్ టెస్ట్‌ను ఆదివారం నిర్వహించారు. జహీరాబాద్ పట్టణంలోని బ్లాక్ రోడ్లో నిర్వహించిన ఈ టెస్ట్‌లో వెలాసిటీ డైరెక్టర్ రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో శేఖర్, రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



పేకాటరాయుళ్ల అరెస్టు

నవతెలంగాణ-ఝరాసంగం

పేకాట ఆడితే ఎంతటి వారినైనా కఠినంగా శిక్షిస్తామని స్థానిక ఎస్ఐ నరేష్ హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని బిడేకన్నె గ్రామంలో ఆదివారం పేకాట ఆడుతున్న స్థావరాలపై ఆయన కొరడా ఝులిపించారు. అందులో భాగంగా ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.3170, మొబైల్ ఫోన్లను స్వాధీన పరుచుకున్నట్టు వెల్లడించారు. మండలంలో ఎవరైనా జూదానికి పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

నిరుపేదలకు సీఎం సహాయ నిధి ఓ ఆపన్న హస్తం

- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- లక్షా 25 వేల ఎల్ఓసి అందజేత

నవతెలంగాణ-పటాన్‌చెరు



ఆపద కాలంలో ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు ఆపన్న హస్తం అందిస్తోందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు పట్టణానికి చెందిన ఠాకూర్ నరేందర్‌సింగ్ ప్రమాదంలో ఎడమ కాలు కోల్పోయాడు. ఈ నేపథ్యంలో కృత్రిమ కాలు కోసం స్థానిక ఎమ్మెల్యే ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. కృత్రిమ కాలు కోసం మంజూరైన ఒక లక్ష 25 వేల విలువైన ఎల్ఓసి అనుమతి పత్రాన్ని ఆదివారం ఎంఎల్ఏ మహిపాల్‌రెడ్డి.. నరేందర్‌సింగ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు. పూర్తి పారదర్శకతతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజా పాలన అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక మంలో నాయకులు రాజన్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వనం.. అధ్వానం



నవతెలంగాణ-కొండాపూర్

గ్రామాల్లో ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించేందుకు ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనాలు పిచ్చి మొక్కలతో అడవులను తలపిస్తున్నాయి. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రకృతి వనాల వైపు పంచాయతీ సిబ్బంది కన్నెత్తయినా చూడడం లేదు. దాంతో పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో పల్లె ప్రకృతి వనాలు దర్శనమిస్తున్నాయి. ఎన్నో వివాదాలను తట్టుకుని ప్రకృతి వనాలను ఏర్పాటు చేసినా.. మున్నాళ్లముచ్చటగానే మారాయి. మండల పరిధిలోని మారేపల్లి పంచాయతీ ఆధ్వర్యంలో ఉన్న ప్రకృతి నిర్వహణను గాలికొదిలేసారు. మండల వ్యాప్తంగా నాలుగైదు గ్రామాల్లో మినహా ఎక్కడా పార్కుల నిర్వహణ సక్రమంగా జరుగడం లేదని విమర్శలు వస్తున్నాయి. ప్రకృతి వనాల నిర్వహణకు వాటర్ ట్యాంక్, మల్టీపర్పస్ వర్కర్లను నియమి ంచినా.. ఎవరూ పట్టించుకోవడమే లేదు. గ్రామ కార్యదర్శులైతే ఆ వైపు కన్నెతి చడడం లేదు. అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారి పోతోంది. అధికారులు కూడా కార్యాలయాలకే పరిమితమై క్షేత్ర స్థాయి పర్యవేక్షణను పూర్తిగా మరిచిపోవడంతో గ్రామాల్లో పంచాయతీ పాలన పట్టుతప్పుతోంది. పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులు, శ్మశాన వాటికల నిర్వహణ.. ఇలా ఏ ఒక్క ప్రభుత్వ పథకాన్ని సక్రమంగా నిర్వహించిన దాఖలాలు లేవు. ఏదో నిర్మించడం..గాలికి వదిలేయడంతో పల్లెల్లో ప్రభుత్వ పథకాలన్నీ మరుగున పడిపోతున్నాయి.అయినా ఇప్పటికీ ఏ కార్యదర్శిపై చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

స్విమ్మింగ్ క్రీడాకారునికి ఘన సన్మానం

నవతెలంగాణ-సంగారెడ్డి



సంగారెడ్డి పట్టణ ప్రాంతానికి చెందిన అబ్దుర్ రెహమాన్ ఈనెల 6, 7 తేదీన భూపాలపల్లిలో జరిగిన 9వ వింటర్ ఇంటర్ డిస్ట్రిక్ స్విమ్మింగ్ ఛాంపియన్షిప్-2024 రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చిన విషయం విధితమే. దాంతో వాసవి మా ఇల్లు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆ క్రీడాకారుడు అబ్దుర్ రెహమాన్‌ను ఆదివారం ఘనంగా సన్మానించి నగదు పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు, వాసవి మా ఇల్లు స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు తోపాజి అనంతకృష్ణ మాట్లాడుతూ.. అబ్దుర్ రెహమాన్ అతి చిన్న వయసులో జిల్లా, రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చడం పట్ల అభినందించారు. అదేవిధంగా రానున్న రోజుల్లో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి మా ఇల్లు స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి పుల్లూరి ప్రకాష్, తోపాజి హరీష్, విద్యాసాగర్, పాండురంగం,మిరియాల మల్లయ్య, అక్షింతల మధు, కే. అశోక్, ఏ. కృష్ణమూర్తి, శ్రీధర్, ఆకుల రేవంత్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షాపై జహీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



నవతెలంగాణ-జహీరాబాద్

బాబాసాహెబ్ అంబేద్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై జహీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమతా సైనికుల నాయకులు రవి తెలిపారు. జహీరాబాద్ పట్టణంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి సమతా సైనిక్ దళ్, బుద్ధిస్ట్ సొసైటీ నాయకులు ఆదివారం పూలమాలలు సమర్పించి.. బాబాసాహెబ్ అంబేద్కర్‌కి ఘన నివాళులర్పించారు. పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్ పై అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. ఈ దేశానికి అహర్నిశలు కృషిచేసి.. దేశ స్వతంత్ర ఉద్యమం లో మూడు రౌండ్ టేబుల్ సమావేశాల్లో పాల్గొని బ్రిటిష్ వారిని తన మేధస్సుతో ఒప్పించిన గొప్ప వ్యక్తి అంబేద్కర్ అని అన్నారు. భిన్నత్వంలో ఏకత్వంగా ఈ దేశాన్ని ముందుకు నడిపించడానికి రెండేండ్ల 11 నెలల 18 రోజులు అహర్నిశలు కృషిచేసి భారత రాజ్యాంగం ద్వారా ఓటు హక్కును కల్పించారని గుర్తు చేశారు. ఐక్యరాజ్యసమితి అంబేద్కర్ జన్మదినాన్ని వరల్డ్ నాలెడ్జ్ డేగా ప్రకటించడం అది భారతజాతికే గర్వకారణమన్నారు. అంతటి మహనీయుడిపై అమిత్ షా వ్యాఖ్యలు సరికాదన్నారు. వెంటనే మీడియా సాక్షిగా ఈ దేశ ప్రజలకు అమిత్ షా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని యెడల దేశవ్యాప్త ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

భేల్ అయ్యప్ప ఆలయంలో మహా అన్న సమారాధన

నవతెలంగాణ-రామచంద్రాపురం



రామచంద్రాపురంలోని భేల్ టౌన్షిప్ లో గల అయ్యప్ప ఆలయంలో ఆదివారం మహా అన్న సమారాధన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. ప్రతి సంవత్సరం భేల్ అయ్యప్ప దేవాలయంలో మహా అన్న సమారాధన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తారు. ఆదివారం దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన 57వ మండలి పూజ, అన్న ప్రసాద వితరణ కార్యక్రమానికి మాలదారులు అయ్యప్ప భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ 25వ తేదీన అయ్యప్ప ఊరేగింపు ఆలయ కమిటీ సభ్యులు నిర్వహిస్తారు. ఊరేగింపుకు ముందు వచ్చే ఆదివారం రోజు మహా అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ ఈసారి జరిగిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమానికి భేల్ చుట్టుప్రక్కల ప్రాంతానికి చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆలయ గురుస్వామి పరమేశ్వరన్ పిళ్లై, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని జాగ్రత్తలను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు అశోక్ కుమార్, గురు స్వాములు, మాలదారులు, అయ్యప్ప భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రాక్ చర్చిలో అంబరాన్నంటిన క్రిస్మస్ సంబురాలు



నవతెలంగాణ-సంగారెడ్డి

క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని పోతిరెడ్డిపల్లి శివారులో ఉన్న రాక్ సంఘంలో చిన్న పిల్లల క్రిస్మస్ కార్యక్రమాలు ఎంతో ఉత్తేజంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో చిన్న పిల్లలు చక్కని నాట్యాలు అంతేకాకుండా పాటలు పిల్లలందరూ కూడా బైబిల్ క్యారెక్టర్స్‌లో చక్కని దుస్తులు ధరించి ప్రజలను ఎంతగానో అలరింపచేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ ఏసు పాల్, రవికుమార్, ఆర్కే, ప్రసన్నకుమార్, ప్రసాద్ పాల్గొన్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో కిరణ్మయి పాస్టర్ అమ్మ, పిల్లలతో కలిసి కేకును కట్ చేశారు. పిల్లల నృత్యాలు పాటలు సభను ఎంతగానో ఆనందింపజేశాయి. ఈనెల 25వ తారీకు ఉదయం 11 గంటలకు ఇలానే ఇంకా ఎన్నో కార్యక్రమంతో అందరూ సన్నద్ధమవుతున్నారని పాస్టర్ ఎస్‌పాల్ తెలిపారు. కార్యక్రమానికి కావాల్సిన ఏర్పాట్లు అన్ని సిద్ధమవుతున్నాయి తెలిపారు.

ఘనంగా వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను ఆయన వీరాభిమాని సింహాచలం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కేబీఆర్ కాలనీకి చెందిన సింహాచలం వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి వీరాభిమాని. సింహాచలం దంపతులు గతంలో వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కావాలని కేబీఆర్ కాలనీ నుంచి పాత శివాలయం వరకు మోకాళ్ళ మీద నడిచి మొక్కుకున్నారు. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించారు. ఈ సందర్భంగా సింహాచలం మాట్లాడుతూ.. మళ్ళీ జగన్ ముఖ్యమంత్రి అవడం ఎవరూ ఆపలేరన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్ రెడ్డి, కాంతారావు, జనార్ధన్ రావు, రవి, టైలర్ రవి తదితరులు పాల్గొన్నారు.

సాదియా కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

- ఎమ్మెల్యే మాణిక్యరావు

నవతెలంగాణ-జహీరాబాద్



మండలంలోని బూచినెల్లి గ్రామ పరిధిలో గల మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో ప్రమాదవశాత్తు మృతి చెందిన విద్యార్థిని సాదియా కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. విద్యార్థిని మృతి విషయం తెలియగానే.. హాస్టల్‌ను ఆకస్మిక తనిఖీ చేసి ప్రమాద వివరాల గురించి ఉపాధ్యాయులను, విద్యార్థినులను అడిగి తెలుసుకొన్నారు. అనుకోకుండా సంఘటన జరిగింది కనుక ఇలాంటి సంఘటన పునావృతం కాకుండా పాఠశాల యజమాన్యం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా భయాందోళనకు గురి కాకుండా ఉండాలన్నారు. సంఘటనకు సంబంధించి ఇప్పటికే మైనార్టీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్‌కు ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. సమగ్ర విచారణలో నిజ నిజాలు బయటపడతాయన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంస్ చైర్మెన్ శివకుమార్, జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, ఝరాసంఘం మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం, మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షులు సంజీవ్ రెడ్డి,బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పట్టించుకోకుండా.. రాజకీయాలా?

- త్వరలో మీ లెక్కలెంటో జనాలు తేలుస్తారు
- మాజీ జెడ్పీటీసీ వ్యాఖ్యలపై మున్సిపల్ కౌన్సిలర్ చంద్రారెడ్డి ఫైర్

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



ప్రజా సమస్యలు పట్టించుకోకుండా శిలాఫలకాల ఏర్పాటుపై బొల్లారం మున్సిపల్ బీఆర్ఎస్ నాయకులు రాజకీయాలు చేస్తున్నారని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మున్సిపల్ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. ప్రజా క్షేత్రంలో తాము చేసిన సవాల్‌ను స్థానిక బీఆర్ఎస్ నాయకులు స్వీకరించకుండా ముఖం చాటేసారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మిషన్ భగీరథ నీటిని విడుదల చేసిన మాట వాస్తవమేనని కానీ అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న మిషన్ భగీరథ పనులను పెట్టుకొని శిలాఫలకాలు ఏర్పాటు చేయాలని చెప్పలేదనే విషయాన్ని సూటిగా ప్రశ్నించారు. మున్సిపాలిటీలో బాగున్న రోడ్లను ధ్వంసం చేయడం ఎందుకని, ఎక్కడైతే పైపులైన్ కోసం తవ్వడం జరిగిందో అక్కడ మరమ్మతులు చేసుకుంటే కొన్నేళ్లపాటు సమస్యలు రావంటూ అడగడం జరుగుతుందన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా ఎక్కడ అడ్డుపడింది కౌన్సిల్ సమావేశాల్లో ఇష్టారాజ్యంగా తీర్మానాలు చేసుకుంటూ పక్షపాతంగా వ్యవహరించిన సంగతి అందరికీ తెలిసిందేనన్నారు. మున్సిపాలిటీలో దాదాపు 1,500 ప్లాట్ల వరకు సొంత ప్రయోజనాల కోసం, అటు గండి గూడెం వరకు, ఇటు సర్వీసు రోడ్డు వరకు ఖతం చేసిన ఘనత వారికే దక్కుతుందన్నారు. హరితహారం కోసం పెద్ద ఎత్తున 30నుంచి 40 లక్షలు కేటాయించారు.. మరి చెట్లు ఎక్కడ నాటారో చూపాలన్నారు. నాడు పంచాయతీ బడ్జెట్ రెండు కోట్ల లోపు ఉంటే, నేడు మున్సిపాలిటీలో 24 కోట్ల బడ్జెట్ను ఏమి చేశారు? ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. అనంతరం జైపాల్ రెడ్డి మాట్లాడుతూ... సవాల్ను స్వీకరించి గాంధీ విగ్రహం దగ్గరకు వచ్చాం. మరి నువ్వెక్కడున్నావ్? డప్పు కొట్టుకునే మాటలు చెల్లవు. అభివృద్ధి మీద పోరాటం ఎక్కడ నుంచైనా మేము సిద్ధం అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గోపాలమ్మ, చంద్రయ్య, కార్మిక నాయకులు లక్ష్మారెడ్డి, స్థానిక నాయకులు శ్రీధర్ రెడ్డి, రమణయ్య, మాజీ ఎంపీటీసీ రాజు, రాజ్ గోపాల్, చంద్రారెడ్డి, చక్రపాణి, రవీందర్ రెడ్డి, మాజీ వార్డ్ మెంబర్ భాస్కర్, దిననాథ్, రాజారామ్, శ్రీమన్నారాయణ, రాజు, శేఖర్, లక్మన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలపై లక్షల కోట్ల అప్పులు

- ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు, ప్రపంచ శాంతి దూత కేఏ పాల్ విమర్శలు

నవతెలంగాణ-సదాశివపేట



రాష్ట్ర ప్రజలపై లక్షల కోట్ల అప్పుల భారం మోపారని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు, ప్రపంచ శాంతి దూత కేఏ పాల్ ఆరోపించారు. సదాశివపేట పట్టణంలోని గామ్ సిటీ చారిటబుల్ ట్రస్టులో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాబోయే సర్పంచ్ ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీ తరపున మద్దతునిచ్చి అభ్యర్థులను గెలిపించుకుంటామన్నారు. గత పాలకులు సర్పంచులను అప్పుల పాలు చేసి, వారి ఆత్మహత్యలకు కారణమయ్యారన్నారు. తెలంగాణను అభివృద్ధి చేయడంలో బీఆంఎస్, కాంగ్రెస్‌లు విఫలం అయ్యాయని ఆరోపించారు. ప్రజాశాంతి అభ్యర్థులను గెలిపిస్తే ప్రతి గ్రామంలో రోడ్లు, నాణ్యమైన విద్య, వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. మందకృష్ణ మాదిగన ఎస్సీలను మోసం చేశారని, ఆర్ కృష్ణయ్య బీసీలను మోసం చేశారన్నారు. కులాలను తాకట్టు పెట్టి పదవిలో అనుభవిస్తున్నారన్నారు.

మున్సిపల్ కార్మికులకు రూ.26వేల కనీస వేతనమివ్వాలి

- పెరిగిన వేతనం అందరికీ అమలు చేయాలి
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు

నవతెలంగాణ-సంగారెడ్డి



మున్సిపల్ కార్మికులకు 11వ పీఆర్సీ ప్రకారం కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, కార్మికులకు పెరిగిన వేతనం అందరికీ అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్‌లో కాంట్రాక్ట్ కార్మికుల జనరల్ బాడీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సాయిలు హాజరై మాట్లాడుతూ.. మున్సిపల్‌లో కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని కోరారు. 11వ పీఆర్సి ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యం పట్ల నిరంతరం శ్రమిస్తున్నా మున్సిపల్ సిబ్బంది అడుగడుగునా వివక్షతకు గురవుతున్నారన్నారు. జీఓ ఆర్డి నెం.60, 63లలో నిర్ణయించిన విధంగా కేటగిరీల వారీ వేతనాలను అమలు చేయాలన్నారు. జీఓఆర్డి నెం. 1037లో ప్రతిపాదించిన మున్సిపాల్టీలలో కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ సేవలను థర్డ్ పార్టీకి అప్పజెప్పాలనే నిర్ణయాలను ఉపసంహరించుకో వాలన్నారు. ఇలానే వ్యవహరిస్తే ప్రభుత్వం పై తిరుగుబాటు చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం. యాదగిరి మాట్లాడుతూ ప్రమాదాల్లో మరణిస్తున్న కార్మికులకు రూ.25 లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టాలని, దహన సంస్కారాలకు రూ.30,000 ఇవ్వాలన్నారు. వయస్సు మీరిన, అనారోగ్యానికి గురైన కార్మికునికి రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలి ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. లేని పక్షం లో పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో యూనియన్ నాయకులు రాజు, దశరథ్, గోపాల్, ఆంజనేయులు, రాము , రవి, వెంక టేశం, కృష్ణ, రాజే ష్, శ్రీనాథ్, సుగుణమ్మ, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.



జిన్నారంలో సెమీ క్రిస్మస్ వేడుకలు

నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారంలో మహా నయీమ్ మినిస్ట్రీస్ చర్చ్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఆదివారం ఘనంగా జరిపారు. ప్రత్యేక గీతాలు ప్రార్థనలు ప్రసంగాలు తారాజువ్వలు వెలుగులు తదితరాలతో సెమీ క్రిస్మస్ వేడుకల సంబరాలను అట్టహాసంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కొమ్మినేని జోసెఫ్, ఇజ్రాయిల్, అమృతవల్లి , నరేందర్ , మాజీ సర్పంచ్ యాదగిరి, యువజన కాంగ్రెస్ నేత నరేందర్ గౌడ్, స్థానికులు, చిన్నారులు ఆహుతులు సెమీ క్రిస్మస్ సందర్భంగా కేక్ కట్ చేసి మూకుమ్మడిగా సంబురాలను ఆనందోత్సవాల మధ్య జరిపారు.

సొంత నిధులతో బోర్ మోటర్ రిపేర్ చేయించిన మాజీ సర్పంచి



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ మండలం గుండ్రెడ్డి పల్లి గ్రామంలో దళిత వార్డులో గ్రామ మాజీ సర్పంచి శ్రీలత రాజిరెడ్డి సొంత నిధులతో బోరు మోటర్‌ను రిపేర్ చేయించి ఆదివారం వినియోగంలోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల రోజులుగా మంచి నీరు రాక ఇబ్బంది పడుతున్న ప్రజల పరిస్థితులను గమనించిన అనంతరం బోరు మోటరు రిపేర్ చేయించాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. మంచినీటి సమస్య ఉందని ప్రభుత్వ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. బోరు మోటర్‌ను ప్రారంభించిన అనంతరం నీరు రావడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. .గ్రామ ప్రజలకు ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉంటానని ప్రజలకు హామీ ఇచ్చారు. దళిత వార్డు ప్రజల దాహార్తిని తీర్చిన మాజీ సర్పంచి శ్రీలత రాజిరెడ్డిని వార్డు ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ అధ్యక్షులు రేపల్లె ప్రశాంత్, యాదగిరి, ఉపాధ్యక్షులు స్వామి గౌడ్, యూత్ అధ్యక్షులు పవన్, నారాగౌడ్, స్వామి, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు అంతరాయం



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ నస్కల్ గ్రామ సబ్‌స్టేషన్లలో విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 10:00 నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు విద్యుత్తు అంతరాయం ఏర్పడుతుందని ఎఈ గణేష్ తెలిపారు. నిజాంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు, నస్కల్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు గమనించి విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు.

మానవహక్కుల సంఘం మండల అధ్యక్షులుగా సుదర్శన్

- నియామకపత్రం అందజేసిన రాష్ట్ర అధ్యక్షులు మొగుళ్ల భద్రయ్య



నవతెలంగాణ-శివ్వంపేట

జాతీయ మానవహక్కుల సంఘం మెదక్ జిల్లా శివ్వంపేట మండల అధ్యక్షులుగా సంద్ర సుదర్శన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఆదివారం జరిగిన జాతీయ మానవ హక్కుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మానవ హక్కుల సంఘం మండల అధ్యక్షులుగా ఎంపికయ్యారు. పిల్లుట్ల గ్రామానికి చెందిన సంద్ర సుదర్శన్ గత కొన్ని సంవత్సరాల నుంచి డాక్టర్‌గా గ్రామ ప్రజలకు ఎన్నోరకాలుగా సేవలందిస్తున్న డాక్టర్ సంద్ర సుదర్శన్ మండల అధ్యక్షులుగా ఎంపిక కావడంతో పిల్లుట్ల గ్రామస్తులతో పాటు స్నేహితులు, చిన్ననాటి మిత్రులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకం ఉంచి తనను జాతీయ మానవ హక్కుల సంఘం మండల అధ్యక్షులుగా నియామకం చేసిన రాష్ట్ర అధ్యక్షులు మొగుల్ల భద్రయ్య, కార్యవర్గ సభ్యులు బొమ్మిరాల మురళీ, జిల్లా అధ్యక్షులు సాయిప్రసాద్, ఉపాధ్యక్షులు బబ్బురి వెంకటేష్ యాదక్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి



నవతెలంగాణ-నర్సాపూర్

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం లాంటిదని నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. ఆదివారం నర్సాపూర్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జక్కపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీకి రూ.48వేలు, నర్సాపూర్ పట్టణానికి చెందిన శేఖర్‌కు రూ.28వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కులను రాజిరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు హరీష్ వర్ధన్, యూత్ కాంగ్రెస్ నాయకులు సుదీర్ గౌడ్ ఉన్నారు.

నేటి నుంచి అచ్చంపేటలో పోచమ్మ జాతర



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ మండల పరిధిలోని అచ్చంపేట గ్రామంలో శ్రీ నల్ల పోచమ్మ ముత్యాలమ్మ, శీతల మాత జాతర ఉత్సవాలు ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. 23వ తేదిన ఆలయ పూజారి హరి ప్రసాద్ శర్మ వేదమంత్రాలతో మధ్యాహ్నం అమ్మవారికి ప్రత్యేక పూజలు, 24న పోచమ్మ అమ్మవారి కళ్యాణోత్సవం. బోనాల ఊరేగింపు, 25న అగ్నిగుండాలు, బండ్ల ఊరేగింపు, కోలాట ప్రదర్శన, 26వ తేదిన పోతరాజు గావు రంగం, చిన్నారులచే కోలాట ప్రదర్శన నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై జాతర ఉత్సవాలను విజయవంతం చేయాలని గ్రామ పెద్దలు కోరారు.

టీ.ఎస్.యు.టీ.ఎఫ్ మండల కమిటీ అధ్యక్షునిగా శ్రీనివాసరావు





నవతెలంగాణ-నార్సింగి

తెలంగాణ స్టేట్ యునైటెడ్ టీచర్స్ ఫోరం నూతన మండల కమిటీని యూనియన్ మెదక్ జిల్లా అధ్యక్షుడు జీ. శ్రీనివాస్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మారావు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. టీ.ఎస్.యు.టీ.ఎఫ్ మండల కమిటీ అధ్యక్షునిగా వెంకటేశం, ఉపాధ్యక్షునిగా నరేష్, శివ జ్యోతిలను ఎన్నుకోగా ప్రవీణ్‌ను ప్రధాన కార్యదర్శిగా, శ్రీనివాస్ ను కమిటీ కోశాధికారిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ నాయకులు మాట్లాడుతూ తమపై నమ్మకముంచి తమను ఎన్నుకున్న జిల్లా కమిటీ నాయకులు, మండల కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. యూనియన్ వారు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా అందరి సహకారం, సంయమనంతో ముందుకు సాగుతామన్నారు. తోటి టీచర్ల హక్కుల సాధన కోసం పాటు పడతామని, అందరి సహకారం కోరుతున్నామని అన్నారు.

అట్టహాసంగా తిమ్మాపూర్ బంగారమ్మ జాతర ఉత్సవాలు

- వేలాదిగా తరలి వచ్చిన అమ్మవారి భక్తులు
- నేడు గ్రామంలో పోతలింగమయ్యకు గావురంగం



నవతెలంగాణ-శివ్వంపేట

మండలంలోని తిమ్మాపూర్ గ్రామ శివారులోని పచ్చటి అటవీ అందాల నడుమ వెలసిన శ్రీబంగారమ్మ తల్లి జాతర ఉత్సవాలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యారు. ప్రతి ఏడాది డిసెంబర్ మాసంలో మూడు రోజుల పాటు జరిగే బంగారమ్మ జాతర ఉత్సవాలు నిర్వాహకులు ఈయేడు మరింత ఘనంగా నిర్వహిస్తున్నారు. జాతర ఉత్సవాలకు జిల్లాలోని అమ్మవారి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి పచ్చని అటవీ అందాల నడుమ వెలసిన బంగారమ్మ తల్లి దర్శనభాగ్యం చేసుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. బంగారమ్మ జాతర ఉత్సవాలలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతరెడ్డి, ఎంపీపీల ఫోరం మాజీ జిల్లా అధ్యక్షులు కల్లూరి హరికృష్ణ, జిల్లా గ్రంధాలయ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, జెడ్పీ మాజీ కో ఆప్షన్ మెంబర్ మన్సూర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్ గుప్త, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్, తదితరులు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర ఉత్సవాలలో భాగంగా సోమవారం గ్రామంలో పోతలింగమయ్యకు గావురంగం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు

వికలాంగులపై ప్రభుత్వం వివక్ష

- పెన్షన్ మంజూరు పై కలెక్టర్లకు అధికారం ఇవ్వాలి.
- కొత్త పెన్షన్ల కోసం గ్రామాలలో యేటా సర్వే చేయించాలి
- ఎఎన్‌పిఆర్‌డి రాష్ట్ర అధ్యక్షులు అడివయ్య డిమాండ్



నవతెలంగాణ-మెదక్

వికలాంగులపై రాష్ట్ర ప్రభుత్వం వివక్ష ప్రదర్శిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం వివక్ష పాటిస్తే తమ గోడు ఎవరికి చెప్పుకుంటారని వికలాంగుల జాతీయహక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు అడివయ్య డిమాండ్ ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యాంగులకు సైతం సమాజంలో సమానమైన గుర్తింపు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఆయన 'నవ తెలంగాణ'తో మాట్లాడారు. జిల్లాల్లో, రాష్ట్రంలో ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. వికలాంగుల కోసం ప్రభుత్వం ప్రత్యేకమైన కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, కొత్త పెన్షన్ల కోసం ప్రతి గ్రామంలో సర్వే నిర్వహించాలని కోరారు. కొత్తగా పెన్షన్ మంజూరు చేసే అధికారం జిల్లా కలెక్టర్లకు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సదరం క్యాంప్ క్యాంపు ఏర్పాటు చేయలేకపోవడంతో ఎంతోమంది వికలాంగులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ప్రతి ఏటా ప్రభుత్వ సిబ్బందితో ఇంటింటి సర్వే నిర్వహించాలని కోరారు. తదుపరి వెంటనే కొత్తగా అర్హులైన వారికి రుణాలు మంజూరు చేసే అధికారాన్ని సైతం జిల్లా కలెక్టర్‌లకు ఇవ్వాలన్నారు. లేని పక్షంలో ఆందోళనలు కొనసాగుతూనే ఉంటాయన్నారు. ప్రభుత్వం తమ బాధలను అసెంబ్లీలో చర్చించి వికలాంగులకు ఉపాధి కోసం ప్రత్యేకమైన ప్యాకేజీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రత్యేకమైన ఉద్యోగాలు కల్పించి వారి ఉపాధి కోసం రుణాలు మంజూరు చేయాలన్నారు. తాను బతకడమే కాకుండా పదిమంది కి ఉపాధి చూపేందుకు అవకాశాలు కల్పించాలని కోరారు.

కొత్త పింఛన్లు మంజూరు చేయని ప్రభుత్వం

రాష్ట్రంలోని బడుగుల వారికోసం ఎంతో కృషి చేస్తున్నామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదికి పైగా గడుస్తున్నా కొత్త పింఛన్ల ఊసే ఎత్తడం లేదన్నారు. పాత పెన్షన్‌లకు దిక్కులేదన్నారు. వికలాంగులు. వృద్ధులు పస్తులుంటున్నారన్నారు. ప్రభుత్వం కార్పోరేట్ల మెప్పు పొందేందుకు యత్నిస్తుందన్నారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో దివ్యాంగులు ఎంతో ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం వెంటనే స్పందించి వికలాంగులకు ప్రత్యేక ప్యాకేజీ ఏర్పాటుచేసి ఆదుకోవాలని కోరారు. లేని పక్షంలో ఉద్యమాలు ఉధృతంగా చేస్తామని హెచ్చరించారు.

కొత్త పెన్షన్లు మంజూరు చేయాలి

రాష్ట్రం కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కొత్త పెన్షన్ మంజూరు చేకపోవడంతో ఎంతోమంది దివ్యాంగులు ప్రతిరోజు ఆరోగ్యం కోసం వినియోగించే టాబ్లెట్ లేకపోవడం మూలంగా అనారోగ్యాల పాలవుతున్నారన్నారు. గత ప్రభుత్వం కంటే ఎంతో చేశామని గొప్పలు చెప్పుకున్న రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల కోసం ఏం చేస్తుందో చెప్పాలని తెలిపారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినంక సైతం ఇక్కట్లు తప్పడం లేదని చెప్పారు.

సదరం క్యాంపు ఎక్కడ....?

వికలాంగుల శాతాన్ని గుర్తించేందుకు ఏర్పాటు చేసే సదరన్ క్యాంపు పత్తా లేకుండా పోయింది. ఇంతమంది దివ్యాంగులు అధికారులకు విన్నవించినా ఫలితం కనిపించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి రెండు నెలలకోసారి సదరన్ క్యాంపు ఏర్పాటు చేసి ఆదుకోవాలని వికలాంగులు కోరుతున్నారు. వేలాది మందికి రెన్యువల్ డేట్ గడిచిపోయిన శిబిరం మాత్రం పత్తా లేదు. ప్రభుత్వం ఇచ్చిన సదరన్ క్యాంపు సర్టిఫికేట్‌లో రెన్యూవల్ తేదీ గడిచిపోవడంతో పెన్షన్ రాక ఎంతో మంది ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. అయినా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు అయినా లేకపోవడం విడ్డూరంగా ఉంది.

గ్లాండ్ కళాశాల సేవకార్యక్రమాలు అభినందనీయం

- ఆలయ కమిటీ చైర్మన్ హంసాన్ పల్లి రాఘవరెడ్డి
- వీ ఫర్ ఉమెన్ సోసైటీ ద్వారా పిల్లుట్లలో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-శివ్వంపేట

గ్రామాలలో కొత్తపేట గ్లాండ్ ఫార్మాస్యుటికల్ సైన్సెస్ కళాశాల చేపడుతున్న సామాజిక, సేవా కార్యక్రమాలు ఎంతో గొప్పవని ఆలయ కమిటీ చైర్మన్ హంసాన్ పల్లి రాఘవరెడ్డి, విద్యా కమిటీ చైర్మన్లు పిల్లి మధు, జింక వెంకటేష్‌లు కొనియాడారు. వీ ఫర్ ఉమెన్ సోసైటీ సౌజన్యంతో గ్లాండ్ కళాశాల సహకారంతో మండపంలోని పిల్లుట్ల గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వీ ఫర్ ఉమెన్ సోసైటీ తరుపున డాక్టర్ ప్రతిభ లక్ష్మీ, డాక్టర్ మదన్ మోహన్, డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ప్రజలకు ఆరోగ్య సేవలు అందించేందుకే ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. మహిళలలో రక్తహీనత వల్ల అనారోగ్య సమస్యలు ఏర్పడతాయని, ఉచిత వైద్య శిబిరంలో మహిళలకు ప్రత్యేకంగా ఆరోగ్య పరీక్షలు, ప్రత్యేక చికిత్సలు అందించడం జరుగుతుందన్నారు. 25 సంవత్సరాలు దాటిన ప్రతి వ్యక్తి కూడ తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, ఆహారపు అలవాట్లను మార్చుకుంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. గ్లాండ్ కళాశాల ప్రిన్సిపాల్ శివ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరానికి సహకరించిన వీ ఫర్ ఉమెన్ సోసైటీ సభ్యులకు, పిల్లుట్ల గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గొల్ల నాగయ్య,డాక్టర్ సంద్ర సుదర్శన్, బుర్ర మురళీ గౌడ్, పిల్లి కృష్ణ, గుల్లయ్యగారి సుదర్శన్, చింత స్వామి,బుర్ర పోచగౌడ్, బొంది శ్రీనివాస్ గౌడ్, మస్కురి కుమార్, గ్లాండ్ సిబ్బంది సతీష్, లక్ష్మీ ప్రసన్న, దివ్య, సంతోష్, సంతోష, లింగం, కుమార్, దన్ రాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

గణితంలో..నీ పుట్టుకకు ఓ లెక్కుంది...!!

గణించేది గణితం
గుణించేది గణితం
గగనాంతరాల గమ్మతులను
గమనించేది గణితం.

నీలోనూ గణితం
నీ చుట్టూ గణితం
కోటానుకోట్లలో నినొక్కడిగా
నిలబెట్టేది గణితం.

నీ పుట్టుకకు ఓ లెక్కుంది
నీ గిట్టుటకు ఓ లెక్కుంది
నీ అడుగులకు లెక్కుంది
నీ తడబాటుకు లెక్కుంది.

కనిపించని కణానికి లెక్కుంది
నిన్ను కనే తల్లి కడుపుకు
ఆ కణాల కలయికకు లెక్కుంది
కణాల విభజనకు లెక్కుంది.

లెక్కలు చిక్కులని, చికాకులని
లెక్కచేయని వారి బ్రతుకుల్లో
ఇక్కట్లే ముసిరేను చీకట్లే....
అంకెల చమురు రంగరించి
సంఖ్యలతో సంగమించి
తార్కికతను వెలిగించు.

లెక్కలంటే అంకెలే కాదు,
ఆ అంకెలతో ఆటలు ఆడొచ్చు
ఆ ఆటలతో కోటలు కట్టేయొచ్చు
పేటలు, పిరమిడ్ లు
నిర్మించొచ్చు
ప్రపంచ వింతలెన్నో
..మరెన్నో.....!!

అందుకే,
అందుకోవాలి ఉన్నత
శిఖరమంటే...
మొదలెట్టాలి నువ్వు రన్ కె
అంకెలకి నువ్వు వెయ్యాలి లంకె.
గణిత దినోత్సవ శు
భాకాంక్షలతో.....


పద్మ ఉప్పుల
జెడ్పీహెచ్ఎస్ పాధ్యాయురాలు,
వెంకటాయపల్లి, మం. తూప్రాన్



నవతెలంగాణ-తూప్రాన్

ఆపదలలో ఆదుకునే ఆపద్బంధువు

- సాలోజిపల్లి షాజహాన్ పటేల్



నవతెలంగాణ-టేక్మాల్


ఆపదలో ఉన్నారంటే గ్రామానికి చెందిన ప్రజలను ఆదుకోవడానికి ఆసుపత్రుల్లో చేర్పడానికి వారి బాగోగులు చూసుకొని బాధ్యతను తాను తీసుకుంటాడు. శుభ, అశుభ కార్యాలకు తన వంతు ఆర్థిక సహాయాన్ని అందించడంలో ఆయనకు ఆయనే సాటి. తన కుటుంబ సభ్యులలో సర్పంచ్ పదవి వచ్చినా తానే ముందుండి అన్ని కార్యక్రమాలను చేస్తూ ఉంటాడు. ప్రభుత్వాధికారులకు తానే సర్పంచిలాగా వ్యవహరిస్తూ అధికారులను రిసీవ్ చేసుకుంటాడు. గత మూడు సంవత్సరాల నుంచి షాజహాన్ పటేల్ గ్రామంలో ట్రాక్టర్‌ను ఉచితంగా వారి అవసరాలకు ప్రజలకు సొంతగా డీజిల్ పోసి ట్రాక్టర్‌ను ఇస్తున్నారు. అవసరం తీరిన తర్వాత ట్రాక్టర్‌ను తిరిగి తన ఇంటి వద్దనే ఉంచమని కోరుతాడు. ప్రజాసేవ చేయడంలో అదో ఆనందం ఉంటుందంటాడు. అవకాశం వస్తే సాలోజిపల్లికి సర్పంచ్‌గా సేవలందిస్తానని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాడు. గతంలో ఉమ్మడి టేక్మాల్ గ్రామపంచాయతీ ఉన్నప్పుడు ఉపసర్పంచ్‌గా మండల ప్రజలకు సుపరిచితునిగా ఉంటాడు. గతంలో ఇన్చార్జి సర్పంచ్‌గా ఉండి పంద్రాగస్టు రోజు జెండాను కూడా ఎగురవేశానని ధీమాగా చెప్తాడు. ప్రస్తుతం ఏ పదవిలో లేకున్నా ప్రజా సేవ అంటే తనకు ఎంతో ప్రేమ అని ఆయన తెలిపారు.

వలసలు నివారించేందుకు ఉపాధి

- ఉపాధి హామీ జాబ్ కార్డుల పంపిణీ

నవతెలంగాణ-టేక్మాల్

గ్రామీణ ప్రాంతంలో వలసలు నివారించేందుకు ఉపాధి హామీ జాబ్ కార్డులను పంపిణీ చేస్తున్నామని టేక్మాల్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు భక్తుల కిషోర్ అన్నారు. ఆదివారం టేక్మాల్ గాంధీభవన్లో ఏర్పాటు చేసిన ఉపాధి హామీ కూలీల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు పొట్టచేత పట్టుకొని హైదరాబాద్ వంటి మహానగరాలకు వలస వెళ్లి తమ జీవితాలను ప్రమాదంలో చాలిస్తున్నారని గుర్తు చేశారు. టేక్మాల్ గ్రామం నుంచి ఎవ్వరు కూడా వలసలు వెళ్లకుండా ఉండేందుకు గ్రామంలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు. గతంలో పనులు చేపట్టి జాబ్ కార్డులు లేని వారికి ప్రస్తుతం జాబ్ కార్డులను అందిస్తున్నట్లు చెప్పారు. ప్రతి వ్యక్తికి 100 రోజులు కూలి పనులు కల్పించే దిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తుంద న్నారు. ప్రతి ఒక్కరూ మెట్ల వద్ద తమ పేర్లను జాబ్‌కార్డులు చూపించి నమోదు చేసుకోవాలని సూచించారు. పనులు చేసిన వారికి వారంలోగా డబ్బులు వారి పేరు మీద జమ అవుతున్నాయన్నారు. ఎవరు కూడా వలసలు వెళ్లకూడదని చెప్పారు.



పిల్లల ఆత్మ రక్షణ కోసం కరాటే కుంగ్ఫూ ఎంతో అవసరం



నవతెలంగాణ-నిజాంపేట్

మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో ఆదివారం ప్రాథమిక పాఠశాల ఆవరణలో గ్రాండ్ మాస్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కుంగ్ఫూ, కరాటే ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చైనీస్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ షాలిన్ కుంగ్ఫూలో భాగంగా పిల్లలకు పాఠశాల ఆవరణలో బెల్టు అవార్డింగ్ టెస్ట్ నిర్వహించారు. తమకు తాముగా నమ్మకం కలిగించే విధంగా ఈ కుంగ్ఫూ అవసర పడుతుందన్నారు. అలాగే పిల్లల ఎదుగుదలకు ఎంతో అవసర పడుతుందన్నారు. అనంతరం పిల్లలకు అవార్డింగ్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వామి, శంకర్, సాయి, సురేష్, శివ, ప్రశాంత్, నవీన్ కుమార్, విజయ్, ప్రశాంత్, బబ్బి, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం దగ్గర అమిత్ షా దిష్టిబొమ్మ దగ్ధం



నవతెలంగాణ-టేక్మాల్

అంబేద్కర్‌న్ను అవమానించే విధంగా మాట్లాడిన కేంద్ర హెూం మంత్రి అమిత్ షాకు తగదని మండల పరిధిలోని పాల్వంచ గ్రామానికి చెందిన అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు సరిదిన కృష్ణ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పాల్వంచ గ్రామంలో అంబేద్కర్ విగ్రహం దగ్గర అమిత్‌షా దిష్టిబొమ్మ దగ్ధం చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. దేవుళ్ళ పేరు చెప్పి పబ్బం గడుపుకుంటున్న బీజేపీకి తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఆయన జోస్ చెప్పారు. బతకడానికి కావలసిన కూడు గుడ్డ గూడు నివాసము ఏర్పాటు చేయడంలో బీజేపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ఉద్యోగాలు కల్పించకపోగా ఉన్న ఉద్యోగాలను ఊడగొడుతున్న కేంద్ర ప్రభుత్వం తీరుపై ఆయన విమర్శలు గుర్తించారు. ఈ కార్యక్రమంలో ఎర్ర సంజీవులు, పాల్వంచ యాదయ్య, పులి మల్లేశం, తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ
4
సిద్దిపేట
సోమవారం | 23 డిసెంబర్ 2024 | www.navatelangana.com

పేదలకు షోలాపూర్ చద్దర్ల పంపిణీ



నవతెలంగాణ-గజ్వేల్

తలకొక్కుల చంద్రకళ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 100 మందికి సహాయం చేసినట్టు ట్రస్ట్ చైర్మన్ తలకొక్కుల లక్ష్మణ్ తెలిపారు. ఆదివారం ట్రస్ట్ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శీతాకాల సమావేశంలో ప్రజలకు పేదలకు ఆదుకునేందుకు తమ సంస్థ ముందుకు వచ్చిందన్నారు. ఇందులో భాగంగానే చారిటబుల్ ట్రస్టు భవన్‌లో తలకొక్కుల చంద్రకళ 9వ వర్ధంతి సందర్భంగా ట్రస్ట్ భవన్‌లో 100 మంది పేదలకు సోలాపూర్ చెద్దర్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ మాట్లాడుతూ గత 9 సంవత్సరాల కాలంగా ట్రస్టు ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేశామని రాబోయే రోజులలో ట్రస్టు ద్వారా విస్తృత సేవ కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ తలకొక్కుల లక్ష్మణ్, దేవులపల్లి రాజారామ్ ఇప్ప ప్రభాకర్ ఆడెపు బాలచంద్రం కృష్ణమూర్తి తుమ్మ నర్సింలు శ్రీనివాస్ దూడం శ్రీరాములు శివ కుమార్ మాదాసు జగదీశ్వర్ చెప్యాల మల్లేశం కోశాధికారి టీ.దుర్గా ప్రసాద్,కార్యదర్శి టీ.మధుసూదన్ సభ్యులు ఆడెపు వెంకటలక్ష్మి భాగ్యలక్ష్మి స్వరూప సరోజినీ దేవి శోభారాణి మణికాంత్ కృష్ణకాంత్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా నూతన బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక



నవతెలంగాణ-సిద్దిపేట

బ్యాడ్మింటన్ అసోసియేషన్ సమావేశంలో సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ మూడు డివిజన్ల క్రీడాకారులు హాజరై నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా తౌటి రాజమహేందర్, ప్రధాన కార్యదర్శిగా బస్వరాజు సత్యం, కోశాధికారిగా డాక్టర్ అరుణ్ సంతోష్, మీడియా ఇంచార్జ్ గా పల్లె స్వామిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు చొప్పదండి సూరి, నీలం శ్రీనివాస్, కొంగ సాంబమూర్తి, పల్లె శ్రీను, శ్రీనివాస వర్మ, శంకర్, రవీందర్, వాసు, జాలరాజు, ఆనంద్, వెంకటేష్, లక్ష్మణ్, సురేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పుస్తె మట్టెల పంపిణీ



నవతెలంగాణ-సిద్దిపేట

వాసవి క్లబ్ యూత్ సంయుక్త ఆధ్వర్యంలో నవ్య శ్రీ వివాహం సందర్భంగా నేతి వేణు కుమార్ సహకారంతో పుస్తె మట్టెలు అందించినట్లు ఐపీసీలు గంప కృష్ణమూర్తి, పుల్లూరు శివకుమార్‌లు తెలిపారు. అన్నపూర్ణ పథకం ద్వారా మూడ మల్లికార్జున్ సహకారంతో పదిమంది నిరుపేదలకు 10 కిలోల చొప్పున బియ్యం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు చకిలం రవి, అర్వపల్లి హరి కిరణ్, పిఆర్ఓ దుర్గయ్య, కౌన్సిలర్ వేణు తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలి

- డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి



నవతెలంగాణ-గజ్వేల్

కేంద్ర హోంశాఖమంత్రి అమిత్ షా రాజ్యాంగ సృష్టికర్త అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలను డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి తీవ్రంగా ఖండించారు. అమిత్ షాను మోడి కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం అనంతరావుపల్లి చౌరస్తాలో అమిత్‌షా దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఏగొండ స్వామి మాట్లాడుతూ నిండు సభలో అంబేద్కర్ గురించి ప్రస్తావిస్తూ అంబేద్కర్‌ను స్మరించేకన్నా దైవనామ స్మరణచేస్తే ఏడు జన్మలదాకా స్వర్గమన్నదక్కుతుందని అంబేద్కర్ పట్ల బిజెపి, ఆర్ఎస్ఎస్ భావజాలన్ని బయటపెట్టారన్నారు. సామాజిక,రాజకీయ,ఆర్థిక,సంస్కృతిక రంగాలలో జాతి నిర్మాణం కోసం పాటుపడిన అంబేద్కర్‌ని విశ్వాసాల మీద అదారపడిన దైవనామంతో పోల్చి తక్కువ చేయడం దారుణమన్నారు. అమిత్‌షా బహిరంగ క్షమాపన చెప్పేవరకు ఉద్యమాలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దళిత యూత్ నాయకులు కొప్పు రవి, దాసరి రాజు, దాసరి రజినీకాంత్, దావనమైన మల్లేశం, దాసరి కపిల్ ,పెర్క శ్రీకాంత్ మంకిడి రజినీకాంత్, గద్దరాజు, సిద్దం బాను, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ రెడ్డి సిగ్గు శరం విడిచి పెట్టారు

- ఎఫ్డిసి మాజీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై విమర్శలు చేసే ముందు సీఎం రేవంత్ రెడ్డి సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారని ఎఫ్డిసి మాజీ చైర్మన్ ప్రతాపరెడ్డి అన్నారు. ఆదివారం గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధిని శాసనసభ వేదికగా ప్రజలకు చెప్పాలి తప్ప తప్పుడు ప్రచారం చేయడం ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి దేశ చరిత్ర చిత్రపటంలో ఉంచిన ఘనత కేసీఆర్ ఉందని రేవంత్ రెడ్డి తెలుసుకోవాలన్నారు. అలా కాకుండా సిగ్గు శరం లేకుండా రేవంత్ రెడ్డి సీఎం హోదాలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రిపై విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఏడాది కాలంలోనే కోట్లాది రూపాల అప్పులు చేసి కుప్పలుగా మార్చినట్లు ఆయన విమర్శించారు. గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా కేవలం విమర్శలు పెట్టి అరెస్టుల పేరిటతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడని ఆయన విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన మన అందరికీ అరెస్టులు కేసులు కొత్తేమి కావని ఆయన అన్నారు. కేటీఆర్‌ను ఎలా అరెస్టు చేస్తారో తమ పార్టీ కూడా చూస్తుందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐటీ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు రోడ్లపై కొస్తే రేవంత్ రెడ్డి ఏమి సమాధానం చెప్తారని ఆయన ప్రశ్నించారు. పది సంవత్సరాల్లో ఐటీ రంగాన్ని దేశవ్యాప్తంగా మొదటి స్థానంలో ఉంచిన ఘనత ఆయనకు ఉందన్నారు. తెలంగాణ రైతులకు పెట్టుబడి సాయం అందించకపోగా ఒక్కొక్క రైతుకు ఎకరానికి రూ.17,500 బాకీ పడినట్లు ఆయన తెలిపారు. రైతులకు బోనస్ ఇవ్వకపోవడమేమిటని ఆయన ప్రశ్నించారు. పత్తి కొనుగోలు కేవలం పది రోజుల్లోనే పూర్తి చేయడం ఎంతవరకు సమంజసం అని ఆయన పేర్కొన్నారు.

నాచగిరిలో భక్తజన సందోహం



నవతెలంగాణ-వర్గల్

మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన నాచారం లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆదివారం రోజున జంటనగరాల నుంచి అలాగే సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ కార్యనిర్వహణాధికారిని అన్నపూర్ణ తెలిపారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశామని తెలిపారు.

కాలమేదైనా కష్టాల కడలిలో కార్మికులు

- నెలల తరబడి అందని జీతాలు
- కుటుంబ పోషణ కోసం రూ.5ల వడ్డీతో అప్పు
- ఐదు మున్సిపాలిటీలో 89 టన్నుల చెత్త సేకరణ
- 499 పంచాయతీలో 80 టన్నుల చెత్త సేకరణ





నవతెలంగాణ-గజ్వేల్

కాలం ఏదైనా కష్టాల కడిలిలో విధులు తప్పడం లేదు. అది చలి కాలమా..? వేసవి, వర్షాకాలమా..? అనే విషయం మున్సిపల్, గ్రామపంచాయతీ కార్మికులకు అవేవీ విధి నిర్వహణముందు అడ్డురావు. ప్రతి కాలంలో మున్సిపల్, గ్రామపంచాయతీ కార్మికులకు కష్ట కాలమైనా పనులు తప్పవు. అయితే కాలాలకు అతీతంగా కార్మికులకు కనీస వసతులు, బెనిఫిట్స్, వైద్య ఆరోగ్య శిబిరాలు, కాలాన్ని దృష్టిలో పెట్టుకొని కార్మికునికి సదుపాయాలు కల్పించవలసిన ప్రభుత్వం కల్పించడం లేదు. జీరో డిగ్రీలో సైతం చెత్త సేకరణ, రోడ్లు శుభ్రపరచడం తప్పదు. 43 డిగ్రీల వేసవిలో సైతం రోడ్లపై ఉన్న చెత్తను తొలగించి ప్రజా ఆరోగ్యానికి తన ఆరోగ్యాన్ని లెక్కచేయకుండా ముందుంటారు. కనీస వేతనాలు పక్కకు పెడితే ప్రభుత్వం ఇచ్చే జీతాలు సకాలంలో సైతం ఇవ్వటం లేదు. అది మున్సిపలా, గ్రామపంచాయతీ సైతం ఇదే దుస్థితి కార్మికుల ఎదుర్కొంటున్నారు. సిద్దిపేట జిల్లాలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్, సిద్దిపేట, హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల మున్సిపాలిటీలతో పాటు 499 గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల పరిస్థితి ఒకే విధంగా ఉంది. టన్నులకొద్దీ చెత్త సేకరణ చేస్తున్నా మున్సిపల్ కార్మికులు, గ్రామపంచాయతీ కార్మికులు నిత్యం సమస్యలు ఎదుర్కొంటున్నారు. కనీస వసతులు ఎక్కడ కనిపించవు. పారిశుద్ధ్య కార్మికులపై సర్కారు కనుకరించడం లేదు. తెల్లవారుజాము నుంచి రాత్రి పొద్దుపోయే వరకు ఏదో ఒక పనిలో నిమగ్నమై మున్సిపాల్, గ్రామపంచాయతీ కార్మికులు విధుల్లో నిర్వహిస్తున్నారు.గత వారం రోజులుగా సిద్దిపేట జిల్లాలో ఎన్నడూ లేని విధంగా చలి ఉష్ణోగ్రతలు 6-7 వరకు పడిపోతున్నాయి. అయిన కార్మికులు ఉదయమే లేచి రోడ్లు ఊడుచుతున్నారు. మున్సిపల్‌లో ఆదాయం వస్తున్న అనుకున్న స్థాయిలో కార్మికులకు వసతులు, జీతాలు లేవు. చలికి కావలసిన మంకీ క్యాపులు, ఉన్ని దుస్తులు లేవు, యూనిఫామ్ తప్ప, చేతులకు బ్లౌజులు, బూట్లు, పంపించేయలేదు. పారిశుద్ధ్య కార్మికులు అధ్వాన స్థితిలో ఉన్నారు. మున్సిపాలిటీలో కార్మికులకు.రూ 15,700, గ్రామపంచాయతీలో రూ.9.500 జీతభత్యాలు ఉన్నాయి.

రోగాలకు కొదవలేదు

మున్సిపాలిటీ, గ్రామపంచాయతీ కార్మికులుగా పనిచేస్తున్న వారికి ప్రభుత్వం మౌలిక సదుపాయాలు, రక్షణ విషయంలో పట్టించుకోవడం వల్ల విధులు నిర్వహిస్తున్న నేపథ్యంలో అనేక రోగాలు దాపరిస్తున్నాయి. మురుగు ఇతర పనిలో భాగంగా కార్మికులకు డెంగ్యూ, విష జ్వరాలు, దగ్గు, మలేరియా తదితర వ్యాధులు సోకి చనిపోయిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ప్రభుత్వం పీఎఫ్, ఈ ఎస్ఐ సౌకర్యాలు అంతంత మాత్రంగానే కల్పిస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం పారిశుద్ధ కార్మికులపై శ్రద్ధ వహించి సకాలంలో జీతాలు మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

గజ్వేల్లో...

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో రోజు చెత్త సేకరణ 10 టన్నుల వరకు జరుగుతుంది. మున్సిపాలిటీలో 150 మంది కార్మికులు పనిచేస్తున్నారు. చెత్త సేకరణకు ఐదు టాక్టర్లు, 13 ఆటో ట్రాలీల చెత్త సేకరణ నిర్వహిస్తున్నారు. కార్మికులు కాలాలకు అతీతంగా రక్షణ కల్పించుకోవడం సొంత డబ్బులతోనే జరుగుతుందన్నారు.

సిద్దిపేట లో...

సిద్దిపేట మున్సిపాలిటీలో రోజు 60 టన్నుల చెత్త సేకరణ నిర్వహిస్తున్నారు. 358 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఆదాయం వస్తున్న సౌకర్యాలు కార్మికులకు ఎక్కడ కనిపించడం లేదు.

చేర్యాలలో...

రోజుకు సుమారు రెండున్నర టన్నుల చెత్తను సేకరిస్తున్నారు. 12 వాహనాల ద్వారా సేకరిస్తున్న ఈ మున్సిపాలిటీలో 87 మంది కార్మికులు ఉన్నారు. ఇక్కడ కూడా పారిశుధ్య కార్మికుల దయనీయ పరిస్థితి ఉన్నది.

దుబ్బాకలో...

దుబ్బాక మున్సిపాలిటీలో 45 మంది కార్మికులు ఉండగా రోజు ఆరు టన్నుల చెత్తను పలు వాహనాలు ద్వారా సేకరిస్తున్నారు.

హుస్నాబాద్ లో..

హుస్నాబాద్ మున్సిపాలిటీలో 86 మంది మున్సిపల్ కార్మికులు చెత్తను సేకరిస్తున్నారు. కనీస సౌకర్యాలు ఇక్కడి కార్మికులు నోచుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం పాశుద్ధ కార్మికుల సౌకర్యాలపై నిర్లక్ష్యం చేస్తుందని చెప్పాలి.

కార్మికులకు సమాన వేతనాలు ఇవ్వాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య



మున్సిపల్ కార్మికులకు రూ.26వేల జీతాలు ఇవ్వాలి. గ్రామపంచాయతీ కార్మికులకు అదే స్థాయిలో ఉండే విధంగా చూడాలి. 50 లక్షల బీమా ఏర్పాటు చేయాలి. కారోబారుగా ప్రమోషన్లు ఇవ్వాలి. పండుగలకు, ఆదివారం సెలవు ఇవ్వాలి. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలి.

కార్మికులకు సౌకర్యాలు కల్పించాలి

సిద్దిపేట మున్సిపల్ కార్మికురాలు పద్మ



కార్మికులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి. ఏ కాలమైనా కార్మికులకు ఇబ్బందిగానే ఉంది. అధికారులు, సర్కారు చోరో చూపాలి. తెల్లారి నుంచి రాత్రి వరకు పనులు చేస్తున్నాం. పనికి తగ్గట్టు జీతాలు ఇవ్వాలి.

పంచాయతీ కార్మికులను పట్టించుకోవాలి

బాబురావు అనంతగిరిపల్లి.



గ్రామపంచాయతీ కార్మికులను ప్రభుత్వం పట్టించుకోవాలి. జీతాలు సకాలంలో ఇవ్వాలి. అప్పు చేసి కుటుంబాన్ని గడుపుతున్నాం. నాలుగు నెలలకొకసారి వస్తాయా లేవా అనేది నమ్మకం లేదు. ప్రతి నెల ఒకటో తేదీ జీతాలు ఇవ్వాలి.

ప్రభుత్వం కష్టాలను గుర్తించడం లేదు

బిక్షపతి గజ్వేల్ మున్సిపల్ కార్మికులు



ప్రభుత్వం మా కష్టాలను గుర్తించాలి. జీతభత్యాలు పెంచాలి. సర్కార్ దృష్టి పెడితే మా సమస్యలు తీరుతాయి. తెల్లవారుజాము నుంచి చెత్త సేకరణ చేస్తున్నాం. చలి, వర్షం, వేసవి కాలం అనేది తమకు అడ్డు రావడం లేదు. రోగాలు వచ్చిన పనులు తప్పడం లేదు.

జిల్లాలో...

సిద్దిపేట జిల్లాలో 499 గ్రామపంచాయతీలు ఉండగా 3,500 కార్మికులు ఉన్నారు. చిన్న గ్రామ పంచాయతీలకు రెండు నుంచి పదిమంది వరకు పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు. మేజర్ గ్రామ పంచాయతీలో 20 నుంచి 35 మంది వరకు విధులు నిర్వహిస్తున్నారు. గ్రామపంచాయతీకిచ్చే ఆదాయం వనరులు బట్టి జీతాలు చెల్లిస్తున్నారు. ఇక్కడ కార్మికులకు ఎలాంటి సౌకర్యాలు లేవు.

ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నాం

- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాడిపల్లి శ్రీనివాస్



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి ఒక్క హామీని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాడిపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విద్య ఉపాధి రంగాలను అభివృద్ధి చేయడానికి తమ ప్రజా ప్రభుత్వం విప్లవత్మక నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు. ఇప్పటికే టీజీపీఎస్సీని ప్రక్షాళన చేసి ఉద్యోగ నియామకాల పారదర్శకతను ప్రదర్శిస్తున్నామని తెలిపారు. ఉద్యోగాల భర్తీకి జాబ్ క్యాలెండర్లను రూపొందించామని, విద్యావ్యవస్థను మరింత పటిష్టం చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఇప్పటికే మహిళ సంక్షేమానికి మహాలక్ష్మి పథకంతో కొత్త పాలనకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ఏడాది ప్రజా ప్రభుత్వ పాలనలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, అర్హులైన వారికి ఉచిత విద్యుత్తు, సబ్సిడీ ద్వారా గ్యాస్ సిలిండర్‌లను అందించడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా గూడు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను అందించడానికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నామన్నారు. రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం ఇప్పటికే ప్రతిష్టాత్మకమైన పథకాలను అమలు చేసి కొత్త చరిత్రను సృష్టించామన్నారు. రైతు భరోసా విధి విధానాలను సైతం రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. వచ్చే ఏడాది సంక్రాంతి తర్వాత రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో నగదును జమ చేస్తామని పేర్కొన్నారు. భూమిలేని నిరుపేదలకు ప్రభుత్వం తరఫున ఏడాదికి రూ.12 వేల ప్రభుత్వం అందించనుందన్నారు. గత ప్రభుత్వం గురుకుల పాఠశాలలను సైతం నిర్లక్ష్యం చేసి, విద్యార్థుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం గురుకుల పాఠశాలలను సైతం ప్రక్షాళన చేస్తుందన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడానికి ఇటీవల ప్రభుత్వం కొత్త మెనూ ప్రకటించిందని గుర్తు చేశారు. సంక్రాంతి తర్వాత కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయడానికి ఇప్పటికే ప్రభుత్వం కసరత్తు ప్రారంభించిందని తెలిపారు. గత పదేళ్ల అధికారంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డులను మంజూరు చేయలేదని గుర్తు చేశారు. ప్రతి రేషన్ కార్డుదారునికి రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సారధ్యంలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ ప్రభుత్వం ఏం సాధించింది

- కాంగ్రెస్ నాయకులు.ఊ డెం సారిక శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

రెండుసార్లు అధికారంలోకి వచ్చి మూడవసారి ఎమ్మెల్యేగా ఉన్నా కేసిఆర్ గజ్వేల్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదని కాంగ్రెస్ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ నాయకుల ఊడెమ్ సారిక శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిచిన తూముకుంట నర్సారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి కృషితో పాటు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మేజర్ గ్రామపంచాయతీని మున్సిపాలిటీగా మార్చినట్లు ఆయన గుర్తు చేశారు. కేసీఆర్ గజ్వేల్ అభివృద్ధిని కుంటు పట్టించినట్లు వారు విమర్శించారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో రోడ్లన్నీ మట్టి రోడ్లుగా ఉన్నట్లు ఏ ఒక్క రోడ్డును సిసి రోడ్‌గా మార్చలేదని ఆయన విమర్శించారు. అండర్ డ్రైనేజీ పేరుతో చేసిన అభివృద్ధి గజ్వేల్ పట్టణానికి పరిమిత మైందన్నారు. మూడోసారి గెలిచిన కేసీఆర్ తెలవక పోవడం సిగ్గు చేటన్నారు. గజ్వేల్ ప్రజలు నమ్మి ఓట్లు వేస్తున్న అభి వృద్ధి చేయడం లేదన్నారు. శాసన సభ నిధుల ద్వారా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని పెండింగ్ పనులను పూర్తి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి నాయకత్వంలో 20 స్థానాలను కైవాసం చేస్తుంటామని వారు ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గజ్వేల్ నియోజకవర్గంలో పాటు మున్సిపాలిటీ ఆవిర్భవం జరిగిందని వారు చెప్పారు. గత ప్రభుత్వ మూలంగా గజ్వేల్ ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు.

సుమారు రెండు కోట్లతో వార్డు అభివృద్ధి

- మున్సిపల్ వైస్ చైర్మన్ జఖీర్



నవతెలంగాణ-గజ్వేల్

సుమారు రెండు కోట్లతో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ఎనిమిదో వార్డును అభివృద్ధి చేసినట్లు వైస్ చైర్మన్ జకీర్ తెలిపారు. ఆదివారం ఆయన నవ తెలంగాణతో మాట్లాడుతూ ఐదు సంవత్సరాలుగా గజ్వేల్ పట్టణ ప్రజలకు 8 వార్డు ప్రజలకు అందుబాటులో ఉన్నానని ఆయన చెప్పారు. వార్డులో రోడ్లు, సిసి రోడ్లు, రూ1.35 లక్షలతో పనులు చేపట్టినట్లు ఆయన చెప్పారు. మురికి కాలువలు మరో రూ30 లక్షలతో చేపట్టినట్లు ఆయన తెలిపారు. వార్డులో స్లాబులు పగిలిపోతే మరో మరమ్మతులు చేయించినట్లు ఆయన తెలిపారు. వార్డులో 14 మందికి బీసీ బంధువు, 150 మందికి కుట్టు మిషన్లు పంపిణీ చేసినట్లు ఆయన చెప్పారు. మరో 70 మందికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించినట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని రద్దు చేసిందని అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాల్‌తో పాటు నియోజకవర్గాల్లో అభివృద్ధి చెందిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను వెంటనే సీఎం రేవంత్ రెడ్డి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ పరిధిలో ఉన్న పెండింగ్ పనులను పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మహిళలకు రూ2500 రూపాయలు వెంటనే అమలు చేయాలనిఆయన డిమాండ్ చేశారు. రైతులకు, వ్యవసాయ కూలీలకు, నిరుద్యోగ భృతి వెంటనే అమలు చేయాలని ఆయన కోరారు. కెసిఆర్ నాయకత్వంలో గజ్వేల్ ను ఒక గుర్తింపు తీసుకొచ్చారని ఆ గుర్తింపును కాపాడుకోవాల్సిన బాధ్యత అన్ని పార్టీలకు ఉందన్నారు.

గ్రామస్తులకు సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యం

- సొంత ఖర్చులతో మరమ్మతులు చేపట్టిన రాజు
- ప్రారంభించిన మాజీ సుడా చైర్మన్ మారెడ్డి రవీందర్ రెడ్డి



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

గ్రామస్తులకు సురక్షితమైన తాగునీరు అందించాలన్న లక్ష్యంతో సొంత ఖర్చుతో బాలవికాస మరమ్మతులు చేపట్టి తాగు నీటిని పున ప్రారంభించామని సిద్దిపేట మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కోడూర రాజు తెలిపారు. ఆదివారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని రాంపూర్ గ్రామ బాలవికాసను మాజీ సుడా చైర్మన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొద్ది రోజుల నుంచి బాలవికాస రిపేరు రావడం వల్ల గ్రామస్తులు మంచినీటి సమస్య రావడంతో తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు. ప్రజలకు మంచినీటిని అందించాలన్న లక్ష్యంతో గ్రామానికి చెందిన రాజు సొంత ఖర్చులతో మరమ్మతులు చేపట్టి గ్రామస్తులకు సురక్షితమైన నీటిని అందించడం చాలా సంతోషకరమన్నారు. అంతేకాకుండా ప్రతి ఇంటికి ఉచితంగా కార్డు పంపిణీ చేసి రీఛార్జ్ చేయించి ఉచితంగా పంపిణీ చేస్తానని తెలిపారు. గ్రామ ప్రజలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో గ్రామ అభివృద్ధికి మరింత కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ సభ్యుల నియామకం

- సభ్యులకు నియామక పత్రమందజేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయ నూతన పాలకవర్గ సభ్యులను నియామకం చేపట్టినట్టు మండల కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ముక్కీస రత్నాకర్ రెడ్డి తెలిపారు. ఆదివారం నియోజకవర్గ ప్రజా భవన్ యందు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నూతన పాలకవర్గ సభ్యులకు నియామకపత్రం అందజేశారు. పాలకవర్గ సభ్యుల నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మండల కాంగ్రెస్ నాయకులకు జెల్లా ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

యువత గంజాయి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- బేగంపేట ఎస్ఐ మహిపాల్ రెడ్డి



నవతెలంగాణ-దౌల్తాబాద్

యువత డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, అవి ఆరోగ్యానికి హానికరమని బేగంపేట ఎస్సై మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం రాయపోల్ మండల కేంద్రంలో కిరాణ షాప్‌లలో నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు, యువత మత్తు పదార్థాల బారిన పడకుండా తల్లిదండ్రులు శ్రద్ధవహించాలన్నారు. నిషేధిత మత్తు పదార్థాలను యువత ఎక్కడైనా వాడుతున్నట్లు తెలిస్తే సమాచారం అందించాలన్నారు. డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు కలిసిన చాక్లెట్స్ ఎవరైనా కలిగి ఉన్న అక్రమంగా రవాణా చేసిన, వాటిని విక్రయించిన చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మాశెట్టి నరేష్, సిల్వేరి అంజనేయులు కిరాణా షాపుల్లో గుట్కా, అంబర్ ప్యాకెట్స్, మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ దేవయ్య, హెడ్ కానిస్టేబుల్ భాస్కర్ రెడ్డి, కానిస్టేబుల్ స్వామి, నార్కోటిక్ బృందం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

5

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

సోమవారం | 23 డిసెంబర్ 2024 | www.navatelangana.com

రాష్ట్ర గవర్నర్ కలిసిన ఎంపీ. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

నవతెలంగాణ-మెదక్

తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ శర్మ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ చర్చిని ఆదివారం సందర్శించారు. మెదక్ చర్చి వందేళ్ళ ఉత్సవాలకు గవర్నర్ ముఖ్యఅతిథిగా హాజరు కావడంతో మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డి తదితరులు ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. గవర్నర్ పాల్గొనే కార్యక్రమంలో సైతం వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డిలు తగిన ఏర్పాట్లు చేసి ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు రాకుండా పర్యవేక్షించారు. జిల్లా అధికార యంత్రాంగం గత రెండు మూడు రోజులుగా ఏర్పాట్లు చేశారు. ఆయన తిరుగు ప్రయాణమై హైదరాబాద్ వెళ్లడంతో ఊపిరి పీల్చుకున్నారు. మెదక్ మున్సిపల్ చైర్మన్ పాల్గొని ఘనంగా స్వాగతం పలికారు.





మూడు రోజుల పాటు ఏబీవీపీ 43వ రాష్ట్ర మహాసభలు

- ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ



నవతెలంగాణ-సిద్దిపేట

ఉద్యమాల గడ్డ సిద్దిపేటలో 43వ ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 23, 24, 25 తేదీలలో సిద్దిపేట కేంద్రంగా ఏబీవీపీ మహాసభలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. 2009లో రాష్ట్ర మహాసభలు జరిగాయని గుర్తు చేశారు. ఈ మహాసభలను రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించి ప్రసంగిస్తారని చెప్పారు. రెండవ రోజు సిద్దిపేట పట్టణంలో ర్యాలీ, బహిరంగ సభ ఉంటుందన్నారు. మూడవరోజు రాష్ట్ర నూతన కార్యవర్గం నియామకం ఉంటుందని వెల్లడించారు. సిద్దిపేట జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఏబీవీపీ కార్యకర్తలు, అభిమానులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏబీవీపీ రాష్ట్ర శాఖ ప్రతినిధులు వివేక్, పవన్, పరశురాములు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సిద్దిపేటలో జరిగే ఏబీవీపీ రాష్ట్ర మహాసభలకు హాజరవుతున్న నేపథ్యంలో సిద్దిపేట తహశీల్దార్ సలీం, మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్, పోలీస్ శాఖ అధికారులు సభ స్థలాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. గవర్నర్ ప్రసంగించే స్థలాన్ని, సభలను ప్రారంభించే స్థలాన్ని పరిశీలించడంతో పాటు, చిన్నకోడూరు మండలంలోని రంగనాయక సాగర్ వద్ద గల గెస్ట్ హౌస్‌ను పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు చేశారు. వారి వెంట రెవెన్యూ ఇన్స్పెక్టర్ బాలయ్య, నరసింహులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

మాజీ జెడ్పీటీసీ గృహప్రవేశ వేడుకలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



నవతెలంగాణ-రాయపోల్

మండల తాజా మాజీ జెడ్పీటీసీ లింగాయపల్లి యాదగిరి తిమ్మక్ పల్లి గ్రామంలో నిర్మించిన నూతన గృహప్రవేశ వేడుకలలో పప్రముఖులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, మెదక్ ఎమ్మెల్సీ వంటేరు యాదవ రెడ్డి, ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్, ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి, రాష్ట్ర నాయకులు మనోహర్ రావు, కత్తి కార్తీక, రొట్టె రాజమౌళి, గజ్వేల్ మాజీ జెడ్పీటీసి పంగ మల్లేశం, గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మాదాస్ శ్రీనివాస్, రాయపోల్ మండల అధ్యక్షులు వెంకటేశ్వర శర్మ, తొగుట మండల అధ్యక్షులు జీడిపల్లి రామిరెడ్డి, రాష్ట్ర యువజన విభాగం నాయకులు రాజీరెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు ఫర్వేజ్, నాయకులు ఇప్ప దయాకర్, కల్లూరి శ్రీనివాస్, రాజు గౌడ్, దయాకర్ రెడ్డి, మంజూర్, వెంకటరామిరెడ్డి, గణేష్, నవీన్, ప్రభాకర్, షాదుల్లా, బాగిరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు. లింగాయపల్లి రజిత యాదగిరి దంపతులకు నూతన గృహప్రవేశం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

గతం ఘనం..నేడు అధ్వానం...

- మండల కేంద్రంలో వెలగని సెంట్రల్ లైటింగ్



నవతెలంగాణ-బెజ్జంకి

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేశారు. దీంతో సెంట్రల్ లైటింగ్ సిస్టంతో మండల కేంద్రం విద్యుత్ వెలుగులతో కాంతులినింది. గతంలో సెంట్రల్ లైటింగ్ సిస్టంతో కాంతులినిన మండల కేంద్రం నేడు నిర్వహణ భారంతో అధ్వాన్నంగా మారింది.సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ చూపి గత వైభవానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరారు.

ప్రశాంతంగా ముగిసిన గవర్నర్ పర్యటన



నవతెలంగాణ-మెదక్/మెదక్ టౌన్

మెదక్ జిల్లాలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పర్యటన పటిష్ట భద్రత నడుమ ప్రశాంతంగా ముగిసింది. గవర్నర్ మొదటగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం సందర్శించారు. గవర్నర్‌కు పూల మొక్కను అందించి కలెక్టర్, ఎస్పీలు ఘన స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ విష్ణు దేవ వర్మ పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలతో చర్చించారు. అక్కడి నుంచి మెదక్ మహాదేవరానికి బయలుదేరారు. మెదక్ చర్చి 100 సం:రాలు పూర్తి అయిన సందర్భంగా సుప్రసిద్ధ మెదక్ చర్చ్‌ని సందర్శించి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ప్రార్థనలు ముగించుకొని కొల్చారం మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడ జరిగిన నృత్య ప్రదర్శనను ఆసక్తిగా తిలకించి వారికి ప్రేరణాత్మక ప్రసంగాన్ని ఇచ్చారు. తరవాత గవర్నర్ విద్యార్థులతో కలసి భోజనం చేసి పర్యటనను ముగించుకొని తిరుగు పప్రయాణమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట భద్రతను జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి పర్యవేక్షించారు. గవర్నర్ పర్యటన ప్రశాంతంగా ముగియడంతో పోలీసు యంత్రాంగంతో పాటు జిల్లా అధికార యంత్రాంగం అంతా ఊపిరి పీల్చుకున్నారు.

మున్సిపాలిటీగా చేసిన 'చేతి' కి ఇప్పటికీ 'చైర్' చిక్కలేదు

- మూడోసారైనా కాంగ్రెస్‌కు చిక్కేన" చైర్"

నవతెలంగాణ-గజ్వేల్

మేజర్ గ్రామపంచాయతీగా కొనసాగుతున్న గజ్వేల్ పట్టణాన్ని మున్సిపల్ కేంద్రంగా మార్చడానికి కాంగ్రెస్ పట్టుదలతో అప్పటి ఉమ్మడి రాష్ట్ర సీఎం కిరణ్ కుమార్ రెడ్డి, పురపాలక శాఖ మంత్రి మహేందర్ రెడ్డి ద్వారా గజ్వేల్‌ను మున్సిపాలిటీగా మార్చారు. ఇప్పటి వరకు కాంగ్రెస్ మున్సిపల్‌పై జెండా ఎగర వెయ్యలేకపోయింది.

ఇక్కడ వివరాల్లోకి వెళితే

మేజర్ పంచాయతీగా 2011 వరకు కొనసాగుతున్న గజ్వేల్ పట్టణాన్ని 2012లో మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని అప్పటి ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి, గజ్వేల్ ఉప సర్పంచ్‌గా పనిచేసిన నాయిని యాదగిరి ప్రయత్నాలు ప్రారంభించారు. అప్పటి ఉమ్మడి సీఎం, పురపాలక శాఖమంత్రిపై ఒత్తిడి తీసుకొచ్చి మున్సిపాలిటీగా మార్చేందుకు గట్టి ప్రయత్నాలు చేసి సక్సెస్ అయ్యారు. ముందుగా గజ్వేల్ పట్టణంతోపాటు క్యాసారం, ముట్రాజ్ పల్లి, ప్రజ్ఞాపూర్, గ్రామపంచాయతీలను ఇందులో విలీనం చేస్తూ గజ్వేల్ మున్సిపాలిటీగా అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. వివిధ గ్రామాల్లో జరిగిన రాజకీయ పరిణామాలు విభేదాల మూలంగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీగా నామకరణం చేశారు.

తొలిసారిగా మున్సిపాలిటీకి ఎన్నికలు

తొలిసారిగా 2014లో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌కు ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 20 వార్డులతో నిర్వహించిన ఎన్నికల్లో తెలుగుదేశం - 10, కాంగ్రెస్-1, బీఆర్ఎస్-9 స్థానాలను గెలుచుకున్నాయి. గజ్వేల్‌ను మున్సిపాలిటీగా మార్పించిన కాంగ్రెస్కు చైర్మెన్ స్థానం దక్కుతుందని ఆశించారు.



కానీ ఒక్క స్థానంతోనే సరిపెట్టుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి అల్వాల బాలేష్ గెలుపొందారు. ఆయన వారం రోజుల్లో బీఆర్ఎస్‌లో చేరారు.

రెండోసారి ఎన్నికల్లో

2018లో జరిగిన రెండోసారి మున్సిపల్ ఎన్నికల్లో తిరిగి ఒకే సీటుకు పరిమితమైంది. ఈ ఎన్నికల్లో సహిన సమీర్ అనే కాంగ్రెస్ మహిళా అభ్యర్థి విజయం సాధించారు. కొన్ని నెలల తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సారి కూడా కాంగ్రెస్‌కి చైర్మెన్ స్థానం అందుకోలేదు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్-13,కాంగ్రెస్-1, స్వతంత్ర అభ్యర్థులు-6 విజయం సాధించారు.

మూడోసారైనా కాంగ్రెస్‌కు చైర్మెన్ పదవి దక్కినా..?



2025లో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కి చైర్మెన్ స్థానాన్ని దక్కించుకునేందుకు పావులు కదుపుతోంది. పార్లమెంటు ఎన్నికల తర్వాత గజ్వేల్ నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు కొంతవరకు జరిగాయి. మున్సిపల్‌తో పాటు నియోజకవర్గంలో చాలా చోట్ల ప్రతిపక్ష పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరారు. గజ్వేల్ పట్టణంలో మాజీ మున్సిపల్ చైర్మెన్ గాడి పల్లి భాస్కర్ కాంగ్రెస్‌లో చేరారు. ప్రస్తుతం మున్సిపల్ చైర్మెన్ పదవిని ఆశించి ఇందులో చేరినట్లు ఆయన వర్గీయులు చెప్పుకొస్తున్నారు. మున్సిపల్‌లో కాంగ్రెస్ పాగ వేసేందుకు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ప్రయత్నాలు ప్రారంభించారు. ఈసారి మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని చూస్తున్నారు.

తూతూ మంత్రంగా ఇండస్ట్రియల్ పార్క్ సర్వే

- మంత్రి ఆదేశాలు బేఖతార్
- దళితులకు అన్యాయం జరిగితే ఊరుకోం

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్, అక్కన్నపేట మండలంలోని తోటపల్లి, చౌటపల్లి, జనగామ గ్రామాల సరిహద్దులో గత ప్రభుత్వాలు దళితులు, వెనుకబడిన కుటుంబాలకు ఇచ్చిన భూముల్లో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులు సర్వే చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇండస్ట్రియల్ పార్కుకు 120 ఎకరాల భూమి అవసరం ఉండగా తోటపల్లి గ్రామ శివారులో ఎస్సీ కార్పొరేషన్ భూముల్లో 20 ఎకరాలు, చౌటపల్లి గ్రామంలోని ప్రభుత్వ భూమి 85 ఎకరాల 13 గుంటలు , జనగామ శివారులోని 16 ఎకరాలలో రెవిన్యూ, సర్వే అధికారులు సర్వే నిర్వహించారు. సర్వే వేగంగా చేయాలని ఆలోచనలో అధికారులు సర్వేను తూతూ మంత్రంగా నిర్వహించారు. ఇటీవల జరిగిన సర్వే అసంపూర్తిగా చేసి కొందరి రైతులకు మాత్రమే కొలతలు వేసి మరి కొంతమంది రైతులను విస్మరించారు. ఈ సర్వేలో కూడా రాజకీయ ప్రమేయం వ్యక్తుల ప్రమేయంతో నడిచినట్టుగా అనుమానాలు వ్యక్తం అవుతున్నయి. అధికారులు కాంగ్రెస్ నాయకులు చెప్పినట్టుగానే సర్వే చేస్తున్నట్లు పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. 312 సర్వే నంబర్ లో 85 ఎకరాల భూమి ఉండగా 140 మంది రైతులు పట్టాదారులున్నారు. ఇందులో ఒక రైతుకు ఐదు గంటలు, 10 గుంటలు, 20 గుంటలు, ఎకరం వరకు భూమి ఉంది ఈ భూముల్లో అధికారులు సర్వే పూర్తి చేశామని చెబుతున్నారు. కానీ కొంతమంది రైతులు సర్వే చేసినప్పుడు లేకపోవడంతో ఆ రైతుల భూములను సర్వే చేయకపోవడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సర్వే అధికారులు స్పీడ్ గా సర్వే పూర్తి చేయాలని ఎంజాయ్ మెంట్‌లో పేరు మీద రాసుకున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.



పూర్తిస్థాయిలో సర్వే చేసి పట్టాదారులను, కబ్జాదారులను గుర్తించకపోతే అధికారులను, పార్కుకు వ్యతిరేకంగా ఆందోళనలు చేపడతామని రైతులు హెచ్చరిస్తున్నారు. ఇండస్ట్రియల్ పార్క్‌లో బాధిత రైతులు దళితులమే ఎక్కువగా ఉన్నారని దళితులకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని దళిత సంఘాల నాయకులు హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామంటున్నారు. అధికారులు ఇప్పటికైనా తోటపల్లి చౌటపల్లి జనగామ శివారులోని భూముల సర్వే పకడ్బందీగా నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

మంత్రి ఆదేశాలు బేఖతార్

ఇండస్ట్రియల్ పార్కుతో అందరికీ మేలు జరుగుతుందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ చూపి పార్కు మంజూరు చేయించారు. అంతేకాకుండా గ్రామ వాసులంతా ఒక్కటై ఒక కమిటీ ఏర్పాటు చేసుకొని సమస్యలన్నీ, ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చేలా ఏకం కావాలని ఆదేశించారు. కానీ మంత్రి మాటలను బేఖతారు చేసి ఇప్పటివరకు కూడా పదిమందితో కూడిన కమిటీ వేయకపోగా, కొంతమంది స్థానిక నాయకులు అధికారులతో కుమ్మక్కై అత్యుత్సాహం చూపిస్తున్నారని కొంతమంది రైతులు ఆరోపణలు చేస్తున్నారు. దీనిపై పూర్తిస్థాయిలో సర్వే చేసి అందరికీ న్యాయం జరిగేలా చూడాలని కోరుతున్నారు.

అభ్యంతరాలు ఉంటే మాదృష్టికి తేవాలి

తహసీల్దార్ అనంతరెడ్డి

రైతులు అంత సహకరించడం వల్ల ఎంజాయ్ మెంట్ సర్వే పూర్తి చేశాం. రైతులు ఎలాంటి అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలి. రైతులు తమ పేర్లు సర్వేలో నమోదు చేయకుంటే తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ వద్ద నమోదు చేసుకోవాలి. పట్టాదారులకు తమ భూమి కంటే ఎక్కువగా ఉంటే పీఓటీ యాక్ట్ పనిచేస్తుంది. రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అందరి అభ్యంతరాలు తీసుకుని న్యాయం చేస్తాం

దళితులకు అన్యాయం జరిగితే ఊరుకోం..

ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు బోయిని సదన్ మహరాజ్



ప్రభుత్వాలు ఇచ్చే నష్టపరిహారంతో పేద దళిత రైతులకు అన్యాయం జరుగుతుంది. దళితులకు గత ప్రభుత్వ ఇచ్చిన భూముల్లో ఇండస్ట్రియల్ పార్కు నిర్మిస్తే రైతులకు మరోచోట భూములను కొనుగోలు చేసి ఇవ్వాలి. పేదల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వ గుర్తించి న్యాయం చేయాలి. దళితులకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదు.

మార్పు అంటే ఏమిటో బీఆర్ఎస్ నేతలకే తెలవాలి

- మున్సిపల్ మాజీ చైర్మన్ గాడి పల్లి భాస్కర్

నవతెలంగాణ-గజ్వేల్

ఏడాదికాలంగా కాంగ్రెస్ పరిపాలనలో మార్పు కనిపించడం లేదని బీఆర్ఎస్ నాయకులు అనడం సిగ్గుచేటని మున్సిపాల్ మాజీ చైర్మన్ గాడి పల్లి భాస్కర్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మార్పు అంటే ఏమిటో గత ప్రభుత్వంలో పనిచేసిన నాయకులు ప్రజాప్రతినిధులు అధికారులు చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంలో ఎంత అభివృద్ధి చేసిందో ఎంత మార్పు తెచ్చిందో గత ప్రభుత్వంలో పనిచేసిన పెద్దలకు ఇంకా బుద్ధి రాకపోవడం సిగ్గుచేటన్నారు. కేవలం విమర్శల కోసమే సీఎం రేవంత్ రెడ్డిని విమర్శిస్తున్నారన్నారు. గజ్వేల్ రింగ్ రోడ్డు, కోట మైసమ్మ రోడ్ విషయంలో చర్చిస్తున్నట్లు ఆయన చెప్పారు. గత ప్రభుత్వం కీలకంగా పని చేసిన నాయకులు ఈరెండు రోడ్ల విషయంలో ఎందుకు పట్టించుకోలేదని ఆయన ప్రశ్నించారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో సీఎం రేవంత్ రెడ్డి సక్సెస్ అయినట్లు ఆయన అన్నారు. అభివృద్ధి అంటే ఏమిటో ఏడాది కాలంలోనే గత ప్రభుత్వంలో పని చేసిన మంత్రులకు చుక్కలు చూపించినట్లు ఆయన తెలిపారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 20 వార్డులను వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ఖాతాలో వేసేందుకు మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి తన వంతు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ప్రతిపక్షాల విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం రేవంత్ రెడ్డి,గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డికి అవసరం లేదన్నారు. అభివృద్ధి అంటే ఏమిటో మరో నాలుగు సంవత్సరాల గడువు ఉందని చేసి చూపిస్తామన్నారు. మున్సిపల్ ఎన్నికలలోపే గజ్వేల్‌లో పెండింగ్ పనులు పూర్తి చేసే బాధ్యతలు మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ కౌన్సిల్ సభ్యులు సుభాష్ చంద్రబోస్, నక్క రేగొండ, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు స్వయం ఉపాధి కల్పించాలి

- బీసీ సంక్షేమ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఉమేష్ యాదవ్

నవతెలంగాణ-గజ్వేల్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ సంక్షేమానికి నిధులు కేటాయించి కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తే స్వయం ఉపాధి కోసం నిధులు కేటాయించాలని సిద్దిపేట జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఉమేష్ యాదవ్ అన్నారు. బీసీలను పట్టించుకోని ఆర్థిక సామాజికంగా బలోపేతానికి కృషి చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక దృష్టి పెట్టి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కార్పొరేషన్ల ద్వారా నిధులు మంజూరు చేసి ఉపాధి కల్పించాలన్నారు. రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య ద్వారా బీసీల సంక్షేమానికి కావాల్సిన చర్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకుపోతున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి బీసీ కుటుంబానికి రూ పది లక్షల రూపాయలు కేటాయించి 90 శాతం సబ్సిడీ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో నిర్లక్ష్యం చేయవద్దని తమ అధినేత కృష్ణయ్య కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సూచిస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రం వ్యాప్తంగా 12 కులాల ఫెడరేషన్‌లను కార్పొరేషన్‌గా



మార్చాలని ఆయన కోరారు. ప్రతి కార్పొరేషన్‌కు పాలకమండలిని ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. గత ప్రభుత్వంలో బీసీ సంక్షేమం పూర్తిగా నిర్వీరమైందని ఆయన విమర్శించారు. బీసీ గురుకుల పాఠశాలకు పక్కాభవనాలను నిర్మాణం చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డికి ఆయన విజ్ఞప్తి చేశారు. గజ్వేల్ నియోజకవర్గంలో ఉన్న సమస్యలను మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ద్వారా పరిష్కారానికి తమంత కృషి చేస్తున్నట్టు ఆయన చెప్పారు. బీసీల సంక్షేమం కోసం తమవంతు కృషి చేస్తున్నామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఆకారం రాజు, రాజు యాదవ్, కొమ్ము యాదవ్, ప్రవీణ్, తిరుపతి, మహేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు అధికారమిస్తే ప్రజలకు ఒరిగిందేమిటి?

- ఏడాదిగా గజ్వేల్ పెండింగ్ పనులు యధావిధం
- సీపీఐ (ఎం) మండల కార్యదర్శి సంధింటి రంగారెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని పెండింగ్ పనులు ఏడాదికాలంగా ముందుకు సాగడం లేదని సీపీఐ (ఎం) గజ్వేల్ మండల కార్యదర్శి సందింటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని కోట మైసమ్మ, రింగ్ రోడ్డు పనులను పూర్తి చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారం మార్పిడితో ఎంతో అభివృద్ధి సాధ్యమవుతుందని గజ్వేల్ ప్రజలు భావించి కాంగ్రెస్‌కు ఓట్లు వేశారని ఆయన తెలిపారు. ఏడాది కాలంలో రింగురోడ్డు 200 మీటర్ల రోడ్డును పూర్తి చేయలేక పోయారన్నారు. 500 మీటర్ల మురికి కాలువను ఇందిరా పార్కు కోట మైసమ్మ రోడ్డులో కోట మైసమ్మ వరకు మురికి కాలువ పూర్తి చేయలేదన్నారు. రోడ్డులో ఇండ్లు కోల్పోతున్న వారికి పరిహారం లేదా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని గతంలోనే తాము డిమాండ్ చేసినట్లు ఇటీవల జిల్లా కలెక్టర్‌ను కూడా కలిసి



నట్లు ఆయన గుర్తు చేశారు. కోట మైసమ్మ, ఇందిరా పార్కు రోడ్డు విషయంలో ప్రజలు అనేక ఇబ్బందులు గురవుతున్నారన్నారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి దృష్టికి సైతం తీసుకపోయినట్లు ఆయన చెప్పారు. రింగ్ రోడ్డు కు సంబంధించిన భూమి విషయంలో రైతుతో చర్చించి పరిష్కారం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మండలంలో చాలా పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఐదు కోట్లతో నిర్మించిన బస్టాండు కేవలం వ్యసనాలకు పరిమితమైందన్నారు. ఇందిరమ్మ కమిటీలతో పేదలకు అన్యాయం జరగవద్దని ఆయన కోరారు. కొందరు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోవాలని ఇందుకు అవగాహన లేకపోయిందన్నారు. ఇందిరమ్మ కమిటీల సర్వే ద్వారా అందరికీ న్యాయం జరగాలని ఆయన కోరారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఏడాది కాలంగా అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు.

మల్లన్న సాగర్‌లో నీళ్లున్నా.. రైతన్నకు నీటి కటకట

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

నవతెలంగాణ-రాయపోల్

మల్లన్న సాగర్‌లో పుష్కలంగా నీళ్ళున్నా రైతులకు నీళ్ల అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని తిమ్మక్ పల్లి గ్రామంలో విలేఖరులతో ఆయన మాట్లాడారు. కేసీఆర్ హయాంలోనే కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టుల వరకు పూర్తి చేసుకోవడం జరిగిందన్నారు. దుబ్బాక నియోజకవర్గంలోని మల్లన్న సాగర్ జల బాండాగారంగా ఉందన్నారు. ఎమ్మెల్యేగా గెలువగానే ఏడాది క్రితం నుంచి మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్‌ల ద్వారా ప్రతి ఎకరాకు సాగు నీరు అందించేలా పిల్లకాలువలు పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. ఎన్ని మార్లు విజ్ఞప్తి చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. నియోజకవర్గంలో కాలువల నిర్మాణం పక్కన పెట్టి హైదరాబాద్‌కు నీళ్ల తీసుకు పోవడానికి పనులు చేపడుతున్నారని, వీరికి రైతుల మీద ఏ పాటి ప్రేమ ఉందో అర్థమవుతుందన్నారు. ఈ ఏడు వర్షాభావ పరిస్థితి ఏర్పడటంతో యాసంగి సాగు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. యాసంగికి కాలువలు నిర్మించి సాగునీళ్ల విడుదల చేయకపోతే పంట పొలాలు ఎండి పోవడం ఖాయమన్నారు. ఒక్క గుంట పొలం ఎండినా అది ప్రభుత్వ వైఫల్యం అవుతుందని, ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. పంట పొలాలకు సాగునీరు విడుదల చేయకుండా హైదరాబాద్‌కు మల్లన్న సాగర్ నుంచి నీటిని తరలిస్తే వేలాది మంది రైతులతో కలిసి అడ్డుకుంటామని హెచ్చరించారు. రాజకీయాలు పక్కన పెట్టి, రైతుల హితమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వెంకటేశ్వర శర్మ, మాజీ జెడ్పిటిసి లింగాయపల్లి యాదగిరి, రాష్ట్ర యువజన విభాగం నాయకులు రాజిరెడ్డి, తొగుట మండల అధ్యక్షులు రామ్ రెడ్డి నాయకులు కల్లూరి శ్రీనివాస్, ఇప్ప దయాకర్, మురళి గౌడ్, నవీన్ గౌడ్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు

